
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.0
కనిష్ఠం 16.4

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 30 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	581.10 (286.1875)	49,357	48,357
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.17 (4.24)	608.67	701.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.045)	2,100	2,000

చికెన్ ధరలు | లైవ్: రూ.130 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.230



తొలి విడత నామినేషన్ల ఘట్టం ముగిసింది

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. నామినేషన్లను ఆదివారం పరిశీలించనుండగా, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబరు 3వ తేదీ వరకు గడువు ఉంది. పోలింగ్‌ను 11వ తేదీన ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- నేడు నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు 3వ తేదీ వరకు గడువు

జిల్లాలో తొలి విడతలో చండూరు, నల్లగొండ డివిజన్లకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పూర్తి కావడంతో అధికార యంత్రాంగం నామినేషన్ల పరిశీలన, చెల్లిన నామినేషన్ల ప్రకటనతో పాటు అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం కార్యక్రమం చేపట్టనుంది. అనంతరం నామినేషన్ల ఉపసంహరణ జరిగిన డిసెంబరు 3న అభ్యర్థులను ప్రకటించి, వారికి గుర్తులను కేటాయిస్తారు. మొదటి విడతలో 14 మండలాల్లోని 318గ్రామాల సర్పంచ్ స్థానాలకు, 2,870 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. చిట్యాల, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, నకిరేకల్,నల్లగొండ, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, తిప్పర్తి, చండూరు, గట్టుప్పల్, మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి మండలాల్లో తొలివిడత ఎన్నికలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి రెండో విడతకు నామినేషన్లు...

జిల్లాలోని మిర్యాలగూడ డివిజన్‌లో రెండో విడత ఎన్నికలకు సంబంధించి 10 మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ డివిజన్‌లోని 282 సర్పంచ్ స్థానాలకు, 2,418 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల, మాడ్గులపల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి (సాగర్), త్రిపురారం, వేములపల్లి మండలాల్లో రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించి ఆదివారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుండగా, ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుంది. డిసెంబరు 2వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 6వ తేదీ వరకు గడువు ఉంటుంది. అదేరోజు అభ్యర్థులను ప్రకటించి గుర్తులను కేటాయిస్తారు...

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 3వ రోజు

జిల్లా	29న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	1483	2289	5845	6854
సూర్యాపేట	500	866	3000	3180
యాదాద్రి	440	844	1776	2450
మొత్తం	2423	3999	10621	12484

అసలేం జరుగుతోంది!

- అక్రమ డిప్యూటేషన్లు పొందిన వారిదే సర్వం పెత్తనం
- పాఠశాలలు, ఎంపీడీవో కార్యాలయాలల్లో సైతం అదే తంతు
- హెచ్‌ఆర్‌ఏపై ఏజేఅడిట్ అధికారులను తప్పుదోవ పట్టించిన వైనం
- పరిపాలనా విభాగంలో ఇష్టారాజ్యం
- జిల్లా పరిషత్‌లో ఉద్యోగులు, అధికారుల మధ్య కోల్డ్‌వార్



జిల్లా పరిషత్‌లో కొందరూ అధికారులు, ఉద్యోగుల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. కార్యాలయంలో ఎవరికి వారేగా వ్యవహరిస్తుంటడంతో పాలనపై ప్రభావం కన్పిస్తోంది. కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా కార్యాలయాలకు వచ్చిపోతున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

కార్యాలయంలో అక్రమ డిప్యూటేషన్లు పొందిన వారు పలు సెక్షన్లలో కర్రపెత్తనం సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంతో పాటు ఆ తరువాత ఇష్టానుసారంగా డిప్యూటేషన్లు పొందినవారిదే రాజ్యమైంది. ఉమ్మడి జిల్లాలో జరిగిన అంతర్గత బదిలీల సందర్భంలో వీరు అక్రమంగా డిప్యూటేషన్లు పొందారు. జాతీయ రహదారిపై ఉన్న ఓ నియోజకవర్గంలోని రెండు మండలాలకు బదిలీపై వెళ్లిన వారు తిరిగి అక్రమ డిప్యూటేషన్లతో జడ్పీకి వచ్చి పూర్వ సెక్షన్లలోనే పని చేయడం వివాదాస్పదంగా మారుతోంది. వాస్తవానికి ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు బదిలీ అయినప్పుడు వారిని తిరిగి అక్రమంగా డిప్యూటేషన్ తీసుకోకూడదనే నిబంధన ఉంది. కానీ, అందుకు భిన్నంగా అక్రమంగా డిప్యూటేషన్లు కల్పించడం గమనార్హం.

పరిపాలనా విభాగంలో సైతం

జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన విభాగంలో అధికారులు, ఉద్యోగులు తోచినట్లు వ్యవహరిస్తున్నారని, నచ్చని ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జడ్పీలో అక్రమ డిప్యూటేషన్లు పొందిన వారు పాత సెక్షన్లలో తిష్ట వేయగా పలువురు ఎంపీడీవో కార్యాలయాలు, పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లు పొందడం గమనార్హం. జడ్పీ పరిధిలో ఎంపీడీవో కార్యాలయాలు ఎంతో కీలకమైనవి కాగా, అక్కడా పాలన దారితప్పే విధంగా డిప్యూటేషన్లు వేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సైతం ఇవే పరిస్థితులు ఉన్నాయి. అదేవిధంగా అధికారులు, ఉద్యోగుల మధ్య సఖ్యత లేకపోవడం కూడా సమస్యగా మారుతోంది. సెక్షన్లలో మార్పులు, చేర్పులు, సర్దుబాటు సమయంలో వారికి అనుకూలమైన వారికి బాధ్యతలు ఇవ్వడం, నచ్చని వారిని దూరం పెట్టడం వివాదానికి దారితీస్తోంది. అనుభవం, సీనియర్లను దృష్టిలో ఉంచుకొని సెక్షన్ల బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా, కీలకమైన శాఖల్లో అనుభవం లేనివారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. అనుభవం ఉన్న వారిని అప్రాధాన్య స్థానాలకు పరిమితి చేయడంతో అధికారులు, ఉద్యోగుల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోంది. ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉద్యోగులకు బాధ్యతలు ఇచ్చారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమయంలో జడ్పీ ఉద్యోగులకు మరిన్ని అదనపు బాధ్యతలు ఉంటాయి. అనుభవం లేని వారికి ప్రాధాన్య శాఖలు కేటాయించడంతో ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. కీలకమైన విభాగాల్లో ఏళ్ల తరబడి తిష్టవేసిన ఉద్యోగులను బదిలీ...

- మిగతా 8వ పేజీలో...

అర్హులందరికీ ఉపకార వేతనాలు వచ్చేలా చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ప్రీ మెట్రిక్ , పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పొందే విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకు తక్షణమే ఎంఈఓలు, హెడ్మాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. హెడ్మాస్టర్లు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి స్కాలర్‌షిప్‌ల విషయాన్ని వారికి తెలియజేసి స్కాలర్‌షిప్స్ పొందేందుకు అవసరమైన ఆధార్, బ్యాంకు ఖాతా, కులం, ఆదాయ ధ్రువపత్రాలు వంటివి సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కాలర్‌షిప్‌ల మంజూరు విషయంలో బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు బ్యాంక్ అధికారులతో మాట్లాడాలని, కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీ విషయంలో తహసీల్దార్‌తో మాట్లాడిన తర్వాత సమస్య ఉంటే నేరుగా రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు తెలియజేయాలన్నారు. ఎంఈవోలు ఒక చెక్ లిస్టు ను తయారు చేసుకుని చెక్ లిస్టు ప్రకారం అన్ని ధ్రువపత్రాలు, ఫొటోతో సహా ఆన్‌లైన్ చేయాలని, స్కాలర్‌షిప్‌లు పొందడం విద్యార్థుల హక్కు అని అన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలని ఆదేశించారు. ఎంఈఓల సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఎంఈఓ లకు షోకాజు నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, సాంఘిక సంక్షేమ డీడీ శశికళ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, ఎల్‌డీఎం శ్రామిక్ పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో అప్రమత్తంగా వున్నట్లే వ్యక్తిగత ఆరోగ్యం విషయంలోనూ పోలీసులు శ్రద్ధ వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మిర్యాలగూడ ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అపోలో, రెనోవా, మాక్స్‌విజన్‌ఐ, క్లోవ్ డెంటల్, రెయిన్‌బో చిల్డ్రన్స్, నల్లగొండ ఐఎంఏ సహకారంతో పోలీసు ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఆయన సందర్శించారు. సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులతో కలిసి రోగనిర్ధారణ పరీక్షలు,మందుల పంపిణీ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. మొత్తం 442 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.40మందిలో సివియర్ వ్యాధులు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణం, సోమనర్సయ్య, పీఎన్‌డి.ప్రసాద్, శ్రీనునాయక్, మిర్యాలగూడ, దేవరకొండ సబ్‌డివిజన్ ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

దేవరకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 6న పర్యటన ఖరారైంది. ముఖ్యమంత్రి బహిరంగ సభతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అందుకుగాను శనివారం దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావులు ముఖ్యమంత్రి సభ స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సభ స్థలాన్ని, ముదిగొండ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్న హెలిప్యాడ్ స్థలాన్ని ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకటరెడ్డిలు పరిశీలించారు. సీఎం సభ ఎక్కడ నిర్వహించాలనేది త్వరలో నిర్ణయించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి


కట్టంగూరులో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి

కట్టంగూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి అన్నారు. కట్టంగూరు మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఎన్నికల నిర్వహించాలని సూచించారు. స్థానిక కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీపీవో కొండా వెంకయ్య, మండల ప్రత్యేక అధికారి సతీష్‌రెడ్డి, ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు, తహసీల్దార్ పుష్పలత, ఎంపీవో స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి: కలెక్టర్

తిప్పర్తి: అభ్యర్థుల నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంతో పాటు మామిడాల, పజ్జూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న నామినేషన్ల ప్రక్రియను శనివారం ఆమె తనిఖీ చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు సమస్యలు ఎదురైతే హెల్ప్‌డెస్క్ ద్వారా వివరాలు పొందాలని సూచించారు. అదే విధంగా హెల్ప్‌డెస్క్ అందించే సేవలను తెలియజేయాలని అన్నారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఒక అభ్యర్థి ఎన్ని సెట్లు నా మినేషన్ పత్రాలు దాఖలు చేశారో వాటిని భద్రపరచాలని సూచించారు. అదే విధంగా అభ్యర్థులకు అవసరమయ్యే సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వచ్చిన నామినేషన్ దరఖాస్తులను టీపోల్ యాప్‌లో పొందుపరచాలని అన్నారు. మొదటి విడత నామినేషన్లకు శనివారం చివరి రోజు అయినందున 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో నామినేషన్లను అనుమతి ఇచ్చేది లేదని పేర్కొన్నారు. సమయం పూర్తయిన తర్వాత నామినేషన్ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరంలో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని తెలిపారు. ఆమె వెంట జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్, ఆర్ఐ ధ్రువఅర్జున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుచేయాలి

నల్లగొండటౌన్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల్లో ఏ చిన్న నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె నల్లగొండ మండలంలోని దండంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని అన్నారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణకు శనివారం చివరి గడువు పూర్తయినందున 5 గంటలలోపు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారికి అనుమతి ఇవ్వాలన్నారు. 5 గంటల తర్వాత ఎలాంటి నామినేషన్లను అనుమతించవద్దని, నామినేషన్ల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, ఎంపీడీవో యాకూబ్‌నాయక్ ఉన్నారు.

'ప్రజావాణి' రద్దు

నల్లగొండ (కలెక్టరేట్): గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 17 వరకు గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, అప్పటి వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించాం


తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేసి ప్రత్యేక తెలంగాణ సాధించామని జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్ అన్నారు. శనివారం దీక్షా దివస్ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నవంబరు 29న దీక్షా దివస్ ఎంతో ముఖ్యమైనదని అన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి మొక్కవోని పట్టుదలతో దీక్షచేసి ఢిల్లీ మెడలు వంచిన రోజు అన్నారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షతో కేంద్రం కదలి వచ్చిందన్నారు. తెలంగాణ సాధన కోసం 11 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో పదేళ్ల పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో పాటు అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్‌నాయక్, కటికం సత్తయ్యగౌడ్, చెరుకు సుధాకర్‌గౌడ్, మందడి సైదిరెడ్డి, మాలే శరణ్యారెడ్డి, నిరంజన్‌వలీ, పల్లె రవికుమార్, ప్రసన్నరాజ్, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, షైనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్కంపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలు విడుదల


అక్కంపల్లిలో చేపలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ ఏడీ రాజారాం

పెద్దఅడిశర్లపల్లి,నవంబరు29(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మత్స్యకారులకు సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్య శాఖ ఏ.డీ రాజారాం అన్నారు. మండలంలోని అక్కంపల్లి రిజర్వాయర్‌లో 12 లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ సభ్యుల ఆధ్వర్యంలో చేపపిల్లను రిజర్వాయర్‌లో శనివారం వదిలారు. ముందుగా రిజర్వాయర్‌కు పూజలు నిర్వహించి అనంతరం చేప పిల్లలను చెరువులో వదిలారు. రవ్వ, బొచ్చ, మిరగాలు చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలినట్లు వారు తెలిపారు. 100 శాతం రాయితీతో ఇచ్చే చేప పిల్లలను ప్రతి మత్స్యకార సభ్యులు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. ప్రతి చెరువుకు నాణ్యమైన చేప పిల్లలను సరఫరా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,100 చెరువులకు 5.98 కోట్ల చేప పిల్లలను విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. నెల రోజుల నుంచి జిల్లాలో చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం చేప పిల్లలను చెరువులో విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. 10-15 రోజుల్లో మిగిలిన చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చేప పిల్లల సైజు బట్టి వేరుచేసి రికార్డు చేయడం జరుగుతుందన్నారు. మాజీ చైర్మన్ తాళ్ల మల్లయ్య, అమర్‌సింగ్, పవన్‌కుమార్, బాలు, తూ టిపల్లి సత్తయ్య, దండుగుల శ్రీను, మత్స్యకారుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి నిధులిచ్చేది

కేంద్ర ప్రభుత్వమే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి


చిన్నకాపర్తిలో బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్ గంగాపురం భాస్కర్‌కు కండువా కప్పుతున్న జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి నిధులను ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని ఈవిషయాన్ని గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నకాపర్తి గ్రామ మాజీ సర్పంచ్ గంగాపురం భాస్కర్‌గౌడ్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. వారికి వర్షిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వ నిధులే ముఖ్యకారణం ఆ విషయం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

స్థానిక సంస్థలతో నే అభివృద్ధి సాధ్యమని అది తెలిసినా గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎన్నికలను నిర్వహించకపోవడంతో గ్రామాలు అభివృద్ధి లేక కుంటుపడిపోయాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గ్రామాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన వార్డు సభ్యులు, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గంగపురం భాస్కర్‌గౌడ్, మునుగోటి లింగయ్య, ఆకుల వెంకన్న, దేవరకొండ కృష్ణమాచారి, మామిడి సత్యనారాయణ, మామిడి నర్సింహ, కొండ లక్ష్మయ్య, మాదగోని శేఖర్‌గౌడ్, బొమ్మగాని నర్సింహ, మామిడి శ్రీను, గురుజ లింగయ్య, గురుజ నిఖిల్‌గౌడ్, లాల్‌కృష్ణ, బొమ్మగాని మదర్, కోనేటి రవి, దేశపాక శ్రీరాములు, మాధవని స్వామి, మాదగోని మధు, బొమ్మగాని సైదులు, రండి నర్సింహ, గంగాపురం నరేందర్, తిరుమలదాస్ సైదులు, పాకాల నర్సింహ, గురుజ గణేష్, జంగయ్య, కొత్త వెంకన్న, కొత్త భాస్కర్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మైల నర్సింహ, మాస శ్రీను, పాల్గొన్నారు.

మరమ్మతులకు 20ఏళ్లకు మోక్షం

7

తూములో గేటు అడ్డం తిరిగింది

ఆమెకు ఎదురేలేదు

● అక్కడ ఒక్కటే ఎస్టీ ఓటు



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

అక్కడ ఎన్నిక ఏకగ్రీవమే. ఏ పార్టీ కూడా అభ్యర్థిని నిలబెట్టే అవకాశమే లేదు. ఎస్టీకి రిజర్వు చేసిన స్థానంలో ఆ సామాజిక వర్గానికి చెందిన ఒకే ఒక్క మహిళా ఓటరు ఉన్నారు. దీంతో ఆమెకు ఎదురే లేకుండాపోయింది. ఆమెకు సర్పంచ్ పదవి అదృష్టంలా వరించింది. ఆమె ఎన్నిక ఇక లాంఛనంగా మారింది. విషయానికి వస్తే నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని గజలాపురం గ్రామపంచాయతీ ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేశారు. ఆ గ్రామంలో బ్రహ్మమల రోజా(33) ఒక్కరే ఎస్టీ ఓటరుగా వున్నారు. దీంతో ఆమె నామినేషన్ వేస్తే ఎన్నిక ఏకగ్రీవమే. గజలాపురం గ్రామానికి చెందిన బొందిరి(బీసీ) సామాజిక వర్గానికి చెందిన బ్రహ్మముల వెంకట్ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన రోజాను 12 ఏళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 2014లో పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీకి రిజర్వ్ అయింది. అప్పటికీ గ్రామంలో రెండే ఎస్టీ ఓట్లు వున్నాయి. ఆ ఎన్నికల్లో గజాలాపురం సర్పంచ్ పదవికి కందుకూరి మల్లయ్య (ఎరుకల), బ్రహ్మమల రోజా పోటీపడ్డారు. ఆ ఎన్నికల్లో రోజా స్వల్ప ఓట్ల(16) మెజార్టీతో మల్లయ్య చేతిలో ఓడిపోయారు. 2019 నాటికి మల్లయ్య మరో గ్రామానికి(గారకుంటపాలెం) మకాం మార్చి అక్కడే స్థిరపడిపోయారు. దీంతో గజలాపురం పంచాయతీలో 8 వార్డుకు చెందిన రోజా ఒక్కరే ఎస్టీ ఓటరుగా మిగిలారు. రెండవ విడతలో జరగనున్న ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

చంటిపాపతో తాత

(ఆంధ్రజ్యోతి-అర్వపల్లి)


అర్వపల్లిలో చంటిపాపతో తాత

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామంలో 10వ వార్డుకు గ్రామానికి చెందిన మహిళ స్వప్న నామినేషన్‌కు చంటిపాపతో వచ్చింది. కేంద్రంలో ఇబ్బందిగా ఉండటంతో ఆరుబయట ఉన్న తండ్రికి పాపను ఇచ్చి నామినేషన్ దాఖలు చేసింది.

ఆదాయాన్ని తెచ్చిన ఎన్నికలు

● ఎన్నికల వేళా పంచాయతీలకు దండిగా ఆదాయం

● నామినేషన్ వేయాలనుకున్నా, బల పరచాలనుకున్నా నో డ్యూస్ తప్పనిసరి

● మొండి బకాయిలకు మోక్షం




(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)

పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని పంచాయతీలకు కాసుల పంట కురుస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనసరిగా ఇంటి పన్ను చెల్లించి ఉండాలనే నిబంధన ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆశావహులు చెల్లింపులు చేయాల్సి వస్తోంది. నల్లగొండ జిల్లావ్యాప్తంగా మూడు విడతల్లో కలిపి 869 సర్పంచ్ స్థానాలు, 7,494 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. వేములపల్లి మండలంలో 12 పంచాయతీలు, 116 వార్డులు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో వార్డు సభ్యులు, సర్పంచ్‌లుగా బరిలో నిలిచే అభ్యర్థులు తమ బకాయిలను పెండింగ్‌లో ఉంచుకోవద్దనే ఉద్దేశ్యంతో ఇంటి పన్నులు చెల్లిస్తున్నారు. దాదాపు రెండేళ్లుగా పంచాయతీలకు ఎన్నికలు లేకపోవడం, ప్రభుత్వం నుంచి నిధులు పూర్తిస్థాయిలో రాకపోవడంతో సరిగా పనులు చేద్దామన్నా పైసలు లేని దుస్థితి నెలకొంది. పంచాయతీల్లో కొందరు రెగ్యులర్‌గా పన్ను చెల్లిస్తుంటే మరికొంతమంది అవసరమైనప్పుడు మాత్రమే పన్ను చెల్లిస్తుంటారు. దీంతో కొంతకాలంగా ఉన్న మొండి బకాయిల సమస్య తీరనుండడంతో సిబ్బందికి వసూళ్ల అవస్థలు తప్పుతున్నాయి. ప్రతీ ఏడాది మార్చి లోపు వసూళ్ల ప్రక్రియ ముగుస్తుంది.

మరో నాలుగు నెలల ముందే బకాయిలు వసూళు అవుతున్న క్రమంలో గ్రామపంచాయతీలకు ఆర్థిక సమస్య తీరనుంది. పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్లు చేసుకుని నో డ్యూ ఇస్తున్నారు. పంచాయతీలకు లక్షలాది రూపాయలు జమ అవుతున్నట్లు సమాచారం.

ఉపసర్పంచ్ పదవి దక్కించుకుందామని..

● వార్డు మెంబర్లకు పోటాపోటీ నామినేషన్లు



(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవుల కోసం ఆశపడ్డ వారి ఆశలను రిజర్వేషన్లు తారుమారు చేశాయి. ఇప్పటి వరకు సర్పంచ్ పదవి కోసం గ్రామాల్లో ఆశావహులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. పెళ్లిళ్లకు, చావులకు, ఆపదలకు ముందుండి పోటీలు పడి సేవలు చేశారు. పట్టణాల నుంచి పల్లెకు వచ్చి సేవలో భాగంగా పలు కార్యక్రమాలకు కోసం రూ.లక్షలు వెచ్చించారు. ఇంతలో రిజర్వేషన్లతో అనుకున్నది ఒక్కటి, అయ్యిందొక్కటీ అన్నట్లుగా మారింది. అయినప్పటికీ రిజర్వేషన్‌లు లేని పదవులపై దృష్టిని సారించారు. ఐదేళ్లు ఖాళీగా ఉండలేక, చేసేదేమీ లేక సర్పంచ్ కాకపోయినా కనీసం ఉపసర్పంచ్ పదవి దక్కకపోతుందా అని ఆలోచిస్తున్నారు. ఈ క్రమంలోనే మొదటగా వార్డు మెంబరుగా పోటీ చేసి గెలిచి తర్వాత మిగతా సభ్యులతో కలసి ఉప సర్పంచ్ పదవి దక్కించుకునేందుకు పావులు కదపాలని ఆలోచిస్తున్నారు. సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్ల ప్యానల్‌ను వేయించడంలో తగు జాగ్రత్తలను వహిస్తున్నారు. గెలిచే అభ్యర్థులను రంగంలో నిలపుతున్నారు. సర్పంచ్ కాకపోయినా ఎలాగైనా ఉపసర్పంచ్ పదవిని దక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పోటాపోటీగా వార్డుమెంబర్లకు నామినేషన్‌లు వేస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 23 పంచాయతీలు, 206 వార్డులు ఉన్నాయి. రాజాపేట, జాల, లక్ష్మక్కపల్లి, దూదివెంకటాపూర్, పారుపల్లి గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవి కోసం ఆశావహులు తీవ్రంగా పోటీ పడుతున్నారు.

గ్రామాల్లో చిత్రమైన పొత్తులు

● రాష్ట్రంలో ఉప్పు, నిప్పు ● గ్రామాల్లో పొత్తుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్

(ఆంధ్రజ్యోతి-నూతనకల్)

పంచాయతీ ఎన్నికల్లో చిత్రమైన పొత్తులు వికసిస్తున్నాయి. రాష్ట్రంలో నిత్యం ఒకరిపై ఒకరు ఉప్పు, నిప్పులా ఉంటూ విమర్శలు చేసుకునే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో ఒక్కటయ్యాయి. వెంకేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నుండే ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఒకరు ఎమ్మెల్యే మందుల సామేలు బలపర్చిన వ్యక్తి కాగా మరొకరు గ్రామ శాఖ, బలపర్చిన అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. గ్రామశాఖ బలపర్చిన అభ్యర్థికి బీఆర్ఎస్, సీపీఎంలు మద్దతు ప్రకటించాయి. మూడు పార్టీల నాయకులు, జెండాలతో ర్యాలీగా వచ్చి నూతనకల్‌లో నామినేషన్ దాఖలు చేశారు.


నామినేషన్‌కు కలిసి ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు

కరెంట్ అకౌంట్ కోసం తిప్పలు


బ్యాంకులో కరెంట్ అకౌంట్ తీసేందుకు కౌంటర్ల వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

నార్కట్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖచ్చితంగా కొత్త బ్యాంక్ అకౌంట్‌ను సమర్పించాలనే ఎస్ఈసీ నిబంధనతో అభ్యర్థులు తిప్పలు పడ్డారు. నామినేషన్‌కు రెండు రోజుల ముందే ఈ విషయం తెలియడంతో శుక్రవారం కొందరు శనివారం మరికొందరు బ్యాంకుల చుట్టూ తిరిగి కరెంట్ అకౌంట్ ఖాతాలను తెరిచేందుకు ఆయాసపడ్డారు. నార్కట్‌పల్లిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా, తెలంగాణా గ్రామీణ వికాస్ బ్యాంక్‌ల కౌంటర్ల వద్ద ఉదయం నుంచే అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతా తెరవడానికి బారులు తీరారు. పైగా కరెంటు అకౌంట్ ఖాతాలో ఎస్‌బీఐలో కనీస నిల్వ రూ.10,000లుగా ఉండటం మిగతా బ్యాంకుల్లో రూ.2,500లుగా ఉండటంతో అందరూ తక్కువ డిపాజిట్ అమౌంట్ ఉండే బ్యాంకుల్లోనే ఖాతాలను తెరిచేందుకు ఆసక్తి చూపారు. దీంతో ఆయా బ్యాంకుల వద్ద దరఖాస్తులు పట్టుకుని అభ్యర్థులు ఖాతా తెరిచేందుకు ఆతృత పడ్డారు. ఎన్నికల్లో నామినేషన్ దాఖలు కోసం శనివారం చివరి రోజు కావడంతో బ్యాంకు సిబ్బంది కూడా అభ్యర్థుల పరిస్థితిని అర్థం చేసుకుని రోజువారీ బ్యాంకు కార్యకలాపాలకు కాస్త విరామం ఇచ్చి అభ్యర్థుల కరెంటు అకౌంట్‌లు తెరవడానికే ప్రాధాన్యమిచ్చారు.

ముందే చెబితే బాగుండేది



అభ్యర్థులకు కొత్త కరెంట్ బ్యాంక్ అకౌంట్ ఖాతాను జతపర్చాలని అధికారులు ముందే చెబితే తమకు ఈ అవస్థ ఉండేది కాదు. ఎప్పటి మాదిరిగానే తమకు ఇప్పటికే ఉన్న సేవింగ్ అకౌంట్స్ జతపర్చవచ్చని భావించాం. కానీ అధికారులు శుక్రవారం సాయంత్రం చెప్పడంతో కరెంటు అకౌంట్ ఖాతా కోసం బ్యాంకు వద్దే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

మేడి నవీన్, వార్డుకు పోటీ చేస్తున్న అభ్యర్థి

అందరికీ ఖాతాలు తెరిచాం



అభ్యర్థులు కరెంటు అకౌంట్‌తో కూడిన కొత్త ఖాతాలను జతపర్చాలనే నిబంధనతో రెండు రోజులుగా ఖాతా తెరిచేందుకు వందల సంఖ్యలో అభ్యర్థులు వచ్చారు. రోజువారీ కార్యకలాపాలు పక్కనపెట్టి అందరికీ ఖాతాలు ఇచ్చి వారికి సహకరించాం. సాధారణ రోజుల్లో అయితే రోజుకు 5 లోపు కొత్త ఖాతాలు తెరుస్తాం. కానీ రెండు రోజులుగా 200కు పైగా ఖాతాలు ఇచ్చాం.

టీజీజీవీబీ నార్కట్‌పల్లి బీఎం, ప్రభాకర్


నార్కట్‌పల్లి మండల కేంద్రంలో 7వ వార్డుకు నామినేషన్ దాఖలు చేసేందుకు కుమారుడిని ఎత్తుకుని క్యూలైన్లలో నిల్చున్న బీ రమ

ప్రియుడి చేతిలో వివాహిత హత్య

● నాలుగు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి

చింతపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రియుడి చేతిలో వివాహిత హత్యకు గురైంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండలంలోని పాలెంతండాకు చెందిన సబావత్ శ్రీనివాస్, జ్యోతి(38)కి 15 ఏళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే తండాకు చెందిన సబావత్ రాజు (జ్యోతికి వరుసకు బంధువు) క్యాటరింగ్ చేస్తూ జీవితం సాగిస్తున్నాడు. రాజు, జ్యోతి, అదే గ్రామంలో ఉండటంతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నెల 25న జ్యోతి పత్తి పొలంలో పనిచేస్తున్న సమయంలో రాజు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాజు జ్యోతి వద్దకు వచ్చి, ఫోన్ ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఆవేశంలో అక్కడే ఉన్న బండరాయితో జ్యోతిపై దాడి చేయగా, జ్యోతి అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని సమీపంలోని బావిలో పడేసి అక్కడి నుంచి పరారయ్యాడు. జ్యోతి కన్పించకుండా పోవడంతో తల్లి నేనావత్ బోడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణలో రాజును నిందితుడిగా గుర్తించారు. జ్యోతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


జ్యోతి(ఫైల్)

జ్యోతి భర్త శ్రీను, తల్లి బోడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

సూర్యాపేటలో సన్నబియ్యం దందా

● నేటికీ 108 క్వింటాళ్ల సన్నబియ్యం పట్టివేత

● ఒక్క రైస్ మిల్లులోనే 90 క్వింటాళ్ల నిల్వ

● వాహనాల్లో మరో 18 క్వింటాళ్ల తరలింపు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)

పేదలు నాణ్యమైన భోజనం తినాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. దొడ్డు బియ్యం సరఫరా చేసిన సమయంలో తెల్లరేషన్‌కార్డుదారులు దాదాపు విక్రయించారు. బియ్యం పక్కదారి పట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభించిన సూర్యాపేట జిల్లాలోనే సన్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజారు నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో ఉన్న ఒక రైస్ మిల్లులో నిల్వ ఉంచిన 90క్వింటాళ్ల సన్న బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 25 కిలోల బ్యాగుల్లో నింపి విక్రయించడానికి మిల్లు యజమాని వాటిని సిద్ధంగా ఉంచాడు. రెవెన్యూ అధికారులు, పోలీసులు పక్కా సమాచారంతో మిల్లుపై దాడి చేసి సన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమానిపై రెవెన్యూ అధికారులు 6ఏ కేసు నమోదు చేయగా, పోలీసు అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పలు దఫాలుగా ఈ సన్న బియ్యాన్ని వివిధ వ్యక్తుల వద్ద కొనుగోలు చేసినట్లు రైస్ మిల్లు యజమాని తెలిపారు. ఒక కిలో సన్న బియ్యాన్ని రూ.12లకు కొనుగోలు చేసి రూ.16లకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఇదే కాకుండా గతంలో కూడా జిల్లా కేంద్రంలో పలుమార్లు చిన్న ట్రక్కుల ద్వారా అక్రంగా రవాణా చేస్తున్న 18క్వింటాళ్ల సన్నబియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దొడ్డు బియ్యం సరఫరా చేసినప్పుడు దాదాపు 90శాతం పక్కదారి పట్టింది. అనేక మంది వినియోగదారులు డీలర్లకు కిలో రూ.8లకే బియ్యాన్ని విక్రయించారు. తిరిగి డీలర్లు ఆ బియ్యాన్ని హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయించారు. ఆ బియ్యాన్ని కోళ్ళు, చేపల దాణా కోసం వినియోగించేవారు. వ్యాపారులు దొడ్డు బియ్యాన్ని కాకినాడ, యానాంకు ఎగుమతి చేసేవారు. పెద్ద ఎత్తున ఈ దందా కొనసాగింది. లాభసాటిగా ఉండటంతో ఎంతో మంది వ్యాపారులుదొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసేవారు. పలువురు వ్యాపారులపై పోలీసులు పీడీ యాక్టు కేసులు నమోదు చేసినా, ఈ అక్రమ వ్యాపారానికి తెరపడలేదు. ప్రస్తుతం దొడ్డుబియ్యం బదులు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ వాటిని కూడా లబ్ధిదారులు విక్రయించడం శోచనీయమని అధికారులు వాపోతున్నారు.


సూర్యాపేటలో రేషన్ బియ్యం పంపిణీ

3,66,064 రేషన్‌కార్డులు

సూర్యాపేట జిల్లాలో 610 రేషన్ దుకాణాలు, 3,66,064 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 10.62లక్షల మంది రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం 68వేల క్వింటాళ్ల రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. మరో 23వేల రేషన్‌కార్డులు కూడా నూతనంగా మంజూరు చేశారు. వాటికి కూడా రేషన్ బియ్యం సరఫరా అవుతోంది.

గ్రామాల్లో తక్కువ.. పట్టణాల్లో ఎక్కువ

గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులు తక్కువగా రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు అక్కడే రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్నందున ఎక్కువ శాతం మిగిలిపోతోంది. ఆ బియ్యాన్ని తిరిగి వచ్చే నెల కోటాలో పంపిణీ చేస్తున్నారు. పట్టణాల్లో మాత్రం దాదాపు 80 నుంచి 85 శాతం బియ్యాన్ని లబ్ధిదారులు తీసుకుంటున్నారు. రేషన్ బియ్యం చాలా బలవర్ధకమైనవని నిపుణులు చెబుతున్నారు. 100కిలోల రేషన్ బియ్యంలో దాదాపు రెండు కిలోల ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధకమైన ఆహారం) కలుపుతారు.

దీంతో కాళ్ల నొప్పులు రావు. ఈ ఆహారం తిన్న వారు కూడా ఎంతో బలంగా ఉంటారు. ఫోర్టిఫైడ్ రైస్ ప్లాస్టిక్ మాదిరిగా ఉన్నందున తినడానికి కొంతమంది బయపడుతున్నారు. సరైన ప్రచారం లేనందునే కొద్దిమంది ఈ సన్న బియ్యాన్ని వినియోగించుకోవడం లేదు. రేషన్ బియ్యాన్ని తీసుకున్న వారు దాదాపు 90శాతం తింటున్నారు.

ప్రైవేట్ దుకాణాలు వెలవెల

జిల్లాలో చాలా మంది బియ్యం వ్యాపారులు ఉన్నారు. ప్రస్తుతం కిలో సాంబ మసూరి బియ్యం ధర రూ.60వరకు ఉంది. సన్నబియ్యం సరఫరాతో బియ్యం అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. గతంలో రోజుకు రూ.6వేలు విక్రయించే బియ్యం వ్యాపారి ప్రస్తుతం రూ.2వేలు కూడా విక్రయించలేకపోతున్నారు. దీంతో ఇతర వ్యాపారాలకు మొగ్గు చూపుతున్నారు. రేషన్‌కార్డు లేని ఉన్నత వర్గాలు మాత్రమే మార్కెట్‌లో బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాయి.

పక్కదారి ఇలా..

సన్న బియ్యం పక్కదారి పట్టడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒక్కోసారి సన్నబియ్యం నాణ్యతగా రానందున కూడా విక్రయిస్తున్నారు. పెద్ద కుటుంబాలు అయితే, వారికి సరిపోను బియ్యాన్ని నిల్వ ఉంచుకుని మిగతావి విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికి అనేక మంది దొడ్డు బియ్యం తింటున్నారు. వీరికి సన్నబియ్యంతో అవసరం లేదు. వీరు కూడా బియ్యాన్ని తీసుకుని దళారులకు విక్రయిస్తున్నారు. కేవలం సన్నబియ్యాన్ని కొనుగోలు చేసే వృత్తిని కూడా కొంతమంది ఎంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతున్నారు.

బియ్యాన్ని విక్రయిస్తున్న వారి రేషన్‌కార్డులు రద్దు చేయాలి



బియ్యాన్ని విక్రయిస్తున్న వారి రేషన్ కార్డులను ప్రభుత్వం రద్దు చేయాలి. ఒక్కోసారి ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం నాణ్యంగా ఉండడం లేదు. దీనివల్ల కూడా తెల్ల రేషన్ కార్డుదారులు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలి. గోనే సంచులు కూడా నాణ్యమైనవి వినియోగించాలి.

చక్రహరి నాగరాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో విస్తృత తనిఖీలు చేశాం



సూర్యాపేటలోని ఓ మిల్లులో 90 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరకగానే జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేశాం. ఎక్కడా రేషన్ బియ్యం దొరకలేదు. అయితే ప్రజలు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యాన్ని వినియోగించుకొని లబ్ధిపొందాలి. ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం బలవర్ధకమైనవి.

మోహన్‌బాబు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి, సూర్యాపేట

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోదాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం అడ్లూరు కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. గణపవరం గ్రామానికి చెందిన షేక్ జానీపాషా(28) ద్విచక్రవాహనంపై గణపవరం నుంచి కోదాడకు వస్తున్నారు. అడ్లూరు కాలనీ వద్ద ఆగిఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో జానీపాషా అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన తండ్రి షేక్ మౌలానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

కాల్వలో పడి గుర్తుతెలియని వ్యక్తికి తీవ్రగాయాలు

కేతేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంతో కాల్వలో పడి గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో శనివారం రాత్రి జరిగింది. చెరుకుపల్లి-కొండకిందిగూడెం గ్రామాల మధ్య రహదారి వెంట గల ఏఎమ్మార్పీ కాల్వలో ద్విచక్రవాహనంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి తీవ్రగాయాలై ఉండటాన్ని 9.30 రాత్రి సమయంలో స్థానికులు గుర్తించారు. సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అడ్రస్ అడిగి మహిళ నుంచి ఆభరణాలు చోరీ

కేతేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా ఉన్న మహిళను అడ్రస్ అడిగి మాట్లాడుతుండగా ఆమె వద్ద ఉన్న చెవికమ్మలను ఎత్తుకెళ్లిన సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ఇనుపాముల గ్రామానికి చెందిన ఉప్పుల వెంకటరమణకు నకిరేకల్ పట్టణ శివారులో పాత, కొత్త జాతీయరహదారుల మధ్య గల ఖాళీ స్థలంలో గేదెల దొడ్డి ఉంది. దొడ్డిలోని గేదెలకు గడ్డి వేసి రావడానికి వెళ్లింది. అదే సమయంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65వ) మీదుగా ద్విచక్రవాహనంపై వెళ్లే యువకుడు ఆ ప్రాంతంలో వెంకటరమణ ఒంటరిగా ఉండడాన్ని గమనించి ఆమె వద్దకు వచ్చి పాత హైవే మీదకు ఎలా వెళ్లాలంటూ ప్రశ్నించాడు. ఆమె సమాధానం చెబుతుండగానే ద్విచక్రవాహనం నుంచి కిందకు దిగి కత్తితో బెదిరించి ఒంటిపై ఉన్న నగలు తీసివ్వాలని బెదిరించాడు. దీంతో భయాందోళనతో గురైన వెంకరమణ పుస్తెల తాడు, చెవి కమ్మలు తీసిచ్చింది. తాను వెళ్లే వరకూ అరవవద్దని బెదిరించడంతో బాధితురాలు మిన్నకుండింది. ఆగంతకుడు ఆభరణాలతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ సతీష్ వివరించారు.

చోరీకి గురైన డబ్బును అప్పగించిన అధికారులు



డబ్బును బాధితుడికి అప్పగిస్తున్న కానిస్టేబుల్ అప్సర్, ఆర్టీసీ అధికారులు

సూర్యాపేట క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :ఓ ప్రయాణికుడి నుంచి చోరీకి గురైన డబ్బును వెతికి పెట్టి తిరిగి బాధితుడికి అప్పగించిన సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన రామగిరి రాములు సూర్యాపేటకు వచ్చి ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బులు తీసుకుని తన గ్రామానికి వెళ్లేందుకు సూర్యాపేటలోని కొత్త బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడ బస్సు ఎక్కే సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి రాములు వద్ద ఉన్న రూ.44వేలను చోరీ చేసి పరారయ్యాడు. గమనించిన బాధితుడు రాములు కేకలు వేయగా అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఎండీ అప్సర్ ప్రయాణికుల సాయంతో చోరీ చేసిన వ్యక్తిని వెంబడించాడు. దీంతో చోరీకి పాల్పడిన వ్యక్తి చోరీ చేసిన డబ్బును కొంత దూరం వెళ్లాక కింద పడేసి పారిపోయాడు. వెంటనే కింద పడిన డబ్బును తీసుకుని ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ ఆర్‌వీ సింగ్, కంట్రోలర్ భాస్కర్, కానిస్టేబుల్ అప్సర్‌లు బాధితుడు రాములుకు అందజేశారు. చోరీ గురైన డబ్బు విషయంలో ఆర్టీసీ, పోలీస్ అధికారులు సకాలంలో స్పందించి డబ్బును తిరిగి బాధితుడికి అప్పగించడంతో వారిని పలువురు అభినందించారు.

ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్ల బైండోవర్

కోదాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని 15 మంది రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

దుకాణంలో మద్యం పట్టివేత

మద్దిరాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నట్లు సూర్యాపేట జిల్లా మద్దిరాల ఎస్ఐ వీరన్న తెలిపారు. శనివారం మద్దిరాల గ్రామంలో బెల్టు దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 16 మద్యం బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వలిగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు భూపాల్‌రెడ్డి ఆవు మేత కోసం ఆ గ్రామ పరిసర ప్రాంతంలోకి వెళ్లింది. మేత మేసే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

నాటకాల నుంచి నటుడిగా

● నటుడిగా రాణిస్తున్న యాదగిరిగుట్టవాసి ఉమాపతిగౌడ్
● చిన్ననాటి నుంచే కళారంగంపై మక్కువ



సోగ్గాడే శోభన్ కృష్ణ సినిమా షూటింగ్ సన్నివేశంలో నటుడు ఉమాపతి



(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్టరూరల్)

యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన రాయగిరి ఉమాపతిగౌడ్ సినిమా రంగంలో రాణిస్తున్నారు. చిన్ననాటి నుంచే కళారంగంపై మక్కువ ఉన్న ఉమాపతి స్నేహితుల ద్వారా అటువైపుగా అడుగులు వేశారు. ఒక మిత్ర బృందాన్ని ఏర్పాటు చేసుకొని సామాజిక చైతన్యం కలిగించే వివిధ అంశాలపై నాటకాలు తయారు చేసేవారు. యాదగిరిగుట్టతో పాటు భువనగిరి, హైదరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో కళా సంస్థల సహకారంతో వాటిని ప్రదర్శించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక నాటకాలు ప్రదర్శించారు. నాటకాల్లో ఉమాపతిగౌడ్ పోషించిన పాత్రలు ఆయనకు మంచిపేరును తీసువచ్చాయి. నటన, నాటక రంగంపై ఆయనకున్న మక్కువను గమనించి సినిమా రంగంలోకి వెళ్లాలని వెన్నుతట్టి ప్రోత్సహించారు. దీంతో సినిమా రంగం వైపు ఆయన అడుగులు పడ్డాయి.

నిరాశ ఎదురైనా..

నాటకరంగంలో ప్రతిభ కనబరుస్తున్న ఉమాపతి సినిమా రంగంలోనూ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పలు సినిమా సంస్థలను, నిర్మాతలను సంప్రదించినా నిరాశే ఎదురైంది. సినిమాల్లో పాత్రలు సంపాదించడం, ఆ రంగంలో నిలదొక్కుకోవడం అంత సులువుకాదని అర్థమైంది. అయినప్పటికీ ఆ రంగంలో ఎదగాలనే కోరికను వదులుకోలేదు. స్నేహితులు, శ్రేయోభిలాషుల సహకారంతో డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిలింలు తీశారు. అదే సమయంలో ప్ర ముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య వద్ద అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జింక హరిబాబు పరిచయం పూర్తిస్థాయి సినిమా తీసేందుకు అడుగులు పడ్డాయి. హరిబాబు దర్శకత్వంలో హీరోగా నటిస్తూ 2019లో 'సోగ్గాడే శోభన్‌కృష్ణ' సినిమాను నిర్మించారు. ఆగస్టు 20న హైదరాబాద్‌తో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రిలో సినిమా విడుదల చేశారు. ఆ సినిమా సినీ ప్రేక్షకుల మన్ననలు పొందింది. గీత కార్మికుడిగా పనిచేస్తూ ఉమాపతి సినిమా రంగంలో ప్రతిభ కనబరుస్తున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


● టీజీబీ ఏజీఎం విజయ్‌భాస్కర్



ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏజీఎం విజయభాస్కర్

నార్కట్‌పల్లి, నవంబరు 29,(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి. విజయ్‌భాస్కర్ అన్నారు. సైబర్ సెక్యూరిటీపై అనే అంశంపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని టీజీబీ శాఖలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడారు. బ్యాంకు నుంచి ఓటీపీ నెంబర్ చెప్పాలని బ్యాంకు నుంచి ఫోన్ చేయరని, అలాంటి ఫోన్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవేళ ఎమరుపాటులో ఉండి మీరు ఓటీపీ చెబితే మీ బ్యాంకు అకౌంట్‌ను సైబర్ మోసగాళ్లు హ్యాక్ చేసి మీ ఖాతాలోని డబ్బును డ్రా చేస్తారని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలతో ఎంతో మంది బాధితులు బ్యాంకులను ఆశ్రయిస్తున్నారని అందుకే ప్రతీ బ్యాంకులో ఈ తరహా సైబర్ సెక్యూరిటీ మోసాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకులో మీ ఖాతా లావాదేవీలు లేదా ఖాతా పుస్తకంలో ఎలాంటి మార్పులు చేర్పులైనా బ్యాంకులో సిబ్బందిని సంప్రదించి జాగ్రత్తపడాలని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు టీజీబీ సదా కృషిచేస్తోందన్నారు. ఈ సదస్సులో బ్యాంకు శాఖ మేనేజర్ శాతం ప్రభాకర్, క్యాషియర్, ఫీల్డ్ ఆఫీసర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా వసతులు కల్పించాలి



బ్యాగ్ స్కానర్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల భద్రత వారికి కావాల్సిన వసతులు ఏర్పాటుకు ఆదేశాలు అమలు చేయాలని ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు అన్నారు. యాదగిరికొండపై ఈవో శనివారం పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. భక్తుల ప్రవేశ ద్వారం వద్ద బ్యాగేజీ స్క్రీనింగ్ యంత్రాలను నిరంతరం పరిశీలిస్తూ మరమ్మతులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. భద్రత వ్యవస్థ పకడ్బందీగా అమలు చేసేందుకు ఎస్పీఎఫ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ అధికారులకు సూచనలు చేశారు. లగేజీ స్కానర్, మెటల్ డిటెక్టర్ల వద్ద రద్దీకి అనుగుణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. క్యూలైన్ల ఏర్పాటు చేసిన యంత్రాల సామర్థ్యాన్ని పరిశీలించి త్వరలో అమలు చేసేందుకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. శని, ఆదివారాల్లో దివ్యాంగులు, వృద్ధులను తూర్పురాజగోపురం తరలించేందుకు బ్యాటరీ వాహనాలు నిరంతరంగా సిద్ధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో వీల్‌చైర్లు అందుబాటులో ఉండే విధంగా ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావును ఆదేశించారు. ఆయన వెంట ఏఈవో గజ్వేల్లి రఘు, సివిల్ విభాగం ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి సన్మానం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఊదరి శ్రీజ జార్ఖండ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచింది. జాతీయ స్థాయికి ఎంపికైన శ్రీజను మాజీ ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని శ్రీనివాస్ కోరారు.



జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన శ్రీజను సన్మానిస్తున్న గ్రామస్థులు

మరమ్మతులకు 20ఏళ్లకు మోక్షం

● ఏఎమ్మార్పీ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు ● రూ.422 కోట్లతో టెండర్లు ఖరారు ● డిసెంబరు 6న శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి



శిథిలావస్థకు చేరిన ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ

దేవరకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకు తాగు, సాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాల్వ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ మరమ్మతులకు 20ఏళ్ల తర్వాత మోక్షం వచ్చింది. ప్రధాన కాల్వ సీసీ లైనింగ్, కంపచెట్లు తొలగింపు మరమ్మ తులు 113కిలోమీటర్ల మేర పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం టెండర్లు ఖరారు చేసింది. డిసెంబరు 6న దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అందుకుగాను అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని 2.20లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలతోపాటు జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యంగా 2001లో ఏఎమ్మార్పీ ప్రాజెక్టును ప్రారంభించారు. నాలుగు మోటర్ల ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతోపాటు ప్రాజెక్టు పరిధిలోని 90చెరువులు నింపడం, హైదరాబాద్ జంటనగరాలతోపాటు జిల్లాకు తాగునీరు అం దించడమే ప్రాజెక్టు లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలోని దే వరకొండ, నాగార్జున సాగర్, నల్లగొండ, నకిరేకల్ నాలుగు నియోజకవర్గాలలో ఈ ప్రాజెక్టు విస్తరించి ఉంది.

శిథిలావస్థలో కాల్వ

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 133 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 150 మీటర్ల పొడవైన కాల్వలకు సీసీలైనింగ్ పనులు చేపట్టలేదు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి లైనింగ్ పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ నిధులు మంజూరు కాలేదు. దీంతో ప్రధాన కాలువతోపాటు డిస్ట్రిబ్యూటరీ కాల్వల ఇరువైపులా కంపచెట్లు పెరిగి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో నీరు సీపేజీ సమస్య తీవ్రతరమైంది. నీరు వృథా అయ్యే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఏఎమ్మార్పీ, డిండి, శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులపై దృష్టిసారించి నిధులు కేటాయించారు. పలు పర్యాయాలు ప్రాజెక్టులపై ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కొన్నేళ్లుగా లైనింగ్ మరమ్మతులకు నోచని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ప్రధానకాల్వ డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు మోక్షం వచ్చింది. మరమ్మతులు పూర్తయితే నీరు వృథా అయ్యే అవకాశాలు ఉండవు. ప్రాజెక్టు నీరు చివరి ఆయకట్టు రైతులకు పూర్తి స్థాయిలో అందనుంది. సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబరు 6న దేవరకొండలో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.



ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

రూ.442 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్ మరమ్మతులకు రూ.442 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

సత్యనారాయణ, ఏఎమ్మార్పీ డివిజన్ 4 ఈఈ

లాంచీ ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● టీజీటీడీసీ వాటర్ ఫ్లూయిడ్ జీఎం మాన్వి



సాగర్-శ్రీశైలం లాంచీని ప్రారంభిస్తున్న టీజీటీడీసీ వాటర్ ఫ్లూయిట్ జీఎం మాన్వీ

నాగార్జునసాగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నుంచి శనివారం ప్రారంభమైన నాగార్జునసాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణాన్ని పర్యాటకులు సద్వినియోగం చేసుకోవాలని టీజీటీడీసీ(తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వాటర్ ఫ్లూయిడ్ జీఎం మాన్వి కోరారు. శనివారం సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించి లాంచీలు శ్రీశైలం బయలు దేరారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. ఈ ఏడాది సాగర్-శ్రీశైలం లాంచీ ఆలస్యంగా ప్రారంభం కావడానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అటవీ శాఖల అనుమతులు రాకపోవడం ఒక కారణమన్నారు. పర్యాటకుల సంఖ్య తక్కువగా ఉండటం కూడా మరో కారణమన్నారు. ఏటా కార్తీక మాసంలో ప్రారంభమయ్యే సాగర్-శ్రీశైలం లాంచీ ప్రయాణం ఈ ఏడాది ఆలస్యంగా ఎందుకు ప్రారంభమైందని విలేకరులు ప్రశ్నించగా శ్రీశైలం దేవాలయం ఏపీలో ఉండటంతో అక్కడ వసతికి గదులు అద్దెకు లభించకపోవడంతో పర్యాటకుల సౌకర్యార్థం ఆలస్యంగా కార్తీకమాసం తర్వాత ప్రారంభించామన్నారు. ఈ వారంనుంచి సాగర్ జలాశయం నీటిమట్టం 550అడుగులకు చేరుకునే వరకు పర్యాటకుల సంఖ్యను బట్టి ప్రతీవారం సాగర్-శ్రీశైలం లాంచీని నడుపుతామన్నారు. కార్యక్రమంలో సాగర్ లాంచీ స్టేషన్ మేనేజర్ హరినాయక్ పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం 581.10 అడుగులు



నాగార్జునసాగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 581.10 అడుగులుగా (286.1875 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 9,500 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 4,034 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 34,023 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 49,357 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 49,357 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ వరదకాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు.

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నిత్య పూజలు శనివారం శాస్త్రోక్తంగా జరి గాయి. గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూ ర్తులను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృ తాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేప ట్టారు. స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయ ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,46,410 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలి పారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని శనివారం మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు శివడి ప్రవీణ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఏకాదశి సందర్భంగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాల ధారణ స్వాములు గిరిప్రదక్షిణ చేయనున్నారు. అయ్యప్ప స్వాముల కోరిక మేరకు సోమవారం (డిసెంబరు 1న) తెల్లవారుజామున 5గంటలకు వైకుంఠ ద్వారం నుంచి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్. వెంకట్రావు ప్రకటిం చారు. అయ్యప్పలతో పాటు గిరిప్రదక్షిణలో పాల్గొనే ఇతర భక్తులకు కూడా ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వాములు ఆహ్వానితులేనని అయ్యప్ప సేవ సమితి కూడా పిలుపునిచ్చింది. సుమారు 20వేల నుంచి 30వేల మంది స్వాములు గిరి ప్రదక్షిణలో భాగస్వాములు కానున్నట్లు సభ్యులు తెలిపారు. బస చేసేందుకు ఆదివారం కొండకింద పాత గోశాల డార్మెంటరీహాల్, కల్యాణ మండపం, కొండపైన డార్మెంటరీ హాల్‌లో వసతికి వినియోగిస్తున్నట్లు ప్రకటించారు.

నేడు అన్నదాన సత్ర భవనం ప్రారంభం

లక్ష్మీ నరసింహస్వామి సత్ర భవనం ఆదివారం ప్రారంభించనున్నారు. కొండకింద ఆధ్యాత్మికవాడలో ఉదయం 10.42 గంటలకు అర్చకులు సుముహూర్తం ఖరారు చేశారు. రూ.23కోట్లకుగానూ ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా గణపవరానికి చెందిన దాత వేగేశ్న అనంతకోటీరాజు రూ.14కోట్ల విరాళం ఇచ్చారు. మిగితా నిధులు వైటీడీఏ, దేవస్థానం ద్వారా సమకూర్చుకొని భక్తుల కోసం కుర్చీలు, టేబుళ్లు, భవన ఆవరణలో దాతల సహకారంతో ప్రత్యేకంగా జల ప్రసాదంతో పాటు దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక హాల్, వసతులు ఆలయ అధికారులు సిద్ధం చేశారు.

కోదాడ నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు

కోదాడ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2వ తేదీన డిపో నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్, కంచి దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి డిసెంబరు 5న ఉదయం 8 గంటలకు కోదాడ చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ. 4 వేలు, పిల్లలకు రూ. 2,200 ఛార్జీ ఉంటుందని, వివరాలకు 9573953143 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టెండర్ల ఆహ్వానం

యాదగిరిగుట్ట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి సంబంధించి యాదగిరిగుట్ట పట్టణంలోని యోగానంద నిలయం కూల్చివేతకు ఈవో ఎస్. వెంకట్రావు టెండర్లు ఆహ్వానించారు. ఈ నెల 22న సీ1/153/2024 ద్వారా టెండరు ప్రకటన విడుదల చేసి 24వ తేదీ నుంచి టెండర్ల స్వీకరించారు. డిసెంబరు 1 వరకు గడువు విధించారు. టెండరులో పాల్గొనే టెండరుదారులు సముదాయాల గోడల నాణ్యతను వేర్వేరుగా పరిశీలిస్తున్నారు. కాగా, 1985 సంవత్సరంలో కొండకింద బస్టాండు ఎదురుగా ప్రధాన రహదారి వెంట వ్యాపారాలు నిర్వహించేందుకు అనువుగా 14 మడిగలు నిర్మించారు. వీటితో పాటు అద్దె గదులు కూడా నిర్మించి దేవస్థానం యోగానంద నిలయం పేరుతో భక్తులకు అందుబాటులోకి తెచ్చింది. అప్పటినుంచి రాజకీయాల సమావేశాలు, స్థానిక, స్థానికేతరుల పెళ్లిళ్ల వేదికగా మారింది. యోగానంద నిలయం కూల్చివేతతో సుమారు 40ఏళ్ల అనుబంధం తెగిపోనుందని వ్యాపారులు వాపోతున్నారు.

రాజేష్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

సూర్యాపేట అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): యువకుడు రాజేష్ మృతికి కారకులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులకు సంబంధించిన విషయంలో బాధితుడు ఈ నెల 8వ తేదీన కేసు పెడితే చిలుకూరు పోలీసులు 4వ తేదీనే ఫిర్యాదు లేకుండా రాజేష్‌ను అదుపులోకి తీసుకొని చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రాజేష్‌ను కుటుంబసభ్యులు కలువనివ్వకుండా అవమానపర్చడం దారుణమన్నారు. రాజేష్ మృతికి కారకులైన ఎస్ఐ, సీఐలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని ధిక్కరించి అక్రమంగా రాజేష్‌ను అదుపులోకి తీసుకొని తీవ్రంగా హింసించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దారుణం జరిగి 13 రోజులు గడిచినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లుమాదిగ, నాయకులు గోవింద్, నరేష్, సోమశేఖర్, యాతాకుల రాజన్న, కందుకూరి సోమన్న, నాగార్జున, బోడ సునీల్, బొజ్జ సైదులు, శ్రీనివాస్, చంద్రస్వామి, రాజు, శ్రీశైలం, వినయ్, జయకర్, రత్నం, వీరేష్‌కుమార్, చినశ్రీరాములు, జానకిరామయ్య, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బీజేపీ ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లాకు ఉదయ్ ప్రతాప్, సూర్యాపేట జిల్లాకు తూటుపల్లి రవికుమార్, యాదాద్రి భువనగిరి జిల్లాకు ఎన్. శ్రీవర్ధన్‌రెడ్డిని నియమించారు.

తూములో గేటు అడ్డం తిరిగింది

● మరమ్మతుల కోసం రిజర్వాయర్ ఖాళీ ● అధికారుల నిర్లక్ష్యంతో ఫలితం శూన్యం ● ఇదీ ముదిమాణిక్యం మేజర్ కాల్వ కథ



ముదిమాణిక్యం మేజర్ కాల్వ, తుప్పు పట్టిన గేటు పై భాగం

మిర్యాలగూడ, వ్యవసాయం(ఆంధ్రజ్యోతి)29: సాగర్ కాల్వలు ఆయకట్టుకు గుండె కాయలాంటివి. దశాబ్దాలుగా అధికారులు కాల్వలను నిర్లక్ష్యంగా వదిలేయంతో ఆనవాళ్లు కోల్పోతున్నాయి. నల్లగొండ జిల్లా త్రిపురారం ఎన్ఎస్ సబ్‌డివిజన్ పరిధిలోని ఎడమ కాల్వపై ముకుందాపురం వద్ద ఉన్న ముదిమాణిక్యం మేజర్‌కాల్వ నీటి విడుదల సామర్థ్యం 420 క్యూసెక్కులు, త్రిపురారం, నిడమనూరు, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లో 24వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు. రెండు దశాబ్దాల క్రితం కాల్వ గేటు దెబ్బతినడంతో కొత్త గేటు ఏర్పాటు చేశారు. అప్పటినుంచి అదే గేటు ఉంది. గేటు తుప్పు పట్టి ఐదేళ్ల క్రితం నీటి ప్రవాహంతో ఊడి కాల్వలో పడిపోయింది. అధికారులు మాత్రం కొత్త గేటు ఏర్పాటు చేయకుండా పాత గేటును బిగించారు. రెండేళ్ల క్రితం కాల్వ గేటు కిందికి దింపుతుండగా తూములో అడ్డం తిరిగింది. కాల్వకు పూర్తిగా నీటి విడుదలను నిలిపి వేసే ప్రయత్నాలు విఫలకావడంతో ఎడమకాల్వలో ఉన్న నీరు మేజర్ తూముల నుంచి సుమారు 120 క్యూసెక్కుల వరకు నిత్యం వృథా అవుతున్నట్లు సమాచారం.

తూము కోసం రిజర్వాయర్ ఖాళీ చేశారు

ఖరీఫ్ సీజన్ ముగిసిన తర్వాత ఎడమ కాల్వకు నీటిని నిలిపివేశారు. ఎడమకాల్వకు జాలు వస్తుండడంతో సుమారు 6-8 అడుగుల వరకు నీరు నిల్వ ఉంది. దాంతో అధికారులు ముదిమాణిక్యం తూము గేటుకు మరమ్మతులు చేయలేకపోయారు. కాల్వలో ఉన్న నీటిని పూర్తిగా ఖాళీ చేస్తే గేటు బిగించవచ్చని అధికారులు తలచారు. తూముకు సమీపంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్(0.5టీఎంసీలు)నీటిని కింద ఉన్న గేట్లు ఎత్తి నీటిని పూర్తిగా ఖాళీచేశారు. అయినప్పటికీ తూము వద్ద ఉన్న నీరు తగ్గలేదు. గేటును బయటకు తీసే ప్రయత్నాలు విఫలమయ్యాయి. రిజర్వాయర్‌లో నీటిని తీయకుండా ముందు ఉన్న తుంగపాడు వాగు గేట్లు ఎత్తితే ఎడమ కాల్వలో ఉన్న నీరు పూర్తిగా వెళ్లిపోయేదని నీటి పారుదల నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డున పడిన మత్స్యకారులు

రిజర్వాయర్‌పై ఆధారపడి పెద్దదేవులపల్లికి చెందిన 650మంది మత్స్యకార సంఘం సభ్యులు ఉన్నారు. ప్రతి ఏడాదిలీజు కింద సుమారు రూ.70వేల వరకు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. చెరువు ఖాళీ చేయడంతో చేపలు లభ్యత లేక ఉపాధి కరువై రోడ్డున పడ్డామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీజు రద్దు చేసి ఆర్థిక సాయం అందజేయాలని మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సింగం ముత్తయ్య ఆధ్వర్యంలో కలెక్టర్, మత్స్యశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎడమ కాల్వపై ప్రధానమైన ముదిమాణిక్యం మేజర్ తూము కాల్వ తూముకు మరమ్మతులు చేయడంపై నీటి పారుదల నిర్లక్ష్యం కన్పిస్తోంది. ఏళ్ల తరబడి కాల్వల గేటు ఏర్పాటు చేయకపోవడంపై నిరంతరం నీరంతా వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పూర్తయ్యే దశలో నీటి ప్రవాహం సాగుతూ ఉండడంతో పంటలు మునిగి నష్టపోయామని రైతులు చెబుతున్నారు. మేజర్ కాల్వకు అధికారులు గేటు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోసం నీటి పారుదల శాఖ అధికారులను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు.

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు

కాంగ్రెస్‌లో అభ్యర్థి ఖరారుపై వీడని చిక్కుముడి..!

- స్నేహపూర్వక పోటీకి కూడా ససేమిరా
- ఆఖరి ఛాన్స్ అంటూ ఒకరు... ఒక్క ఛాన్స్ అని మరొకరు
- రసవత్తరంగా మారిన నార్కట్‌పల్లి కాంగ్రెస్ రాజకీయం
- మండలంలో అందరి దృష్టి నార్కట్‌పల్లి పైనే

నార్కట్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్‌లో పోటీ తప్పదా? అంటే పరిస్థితులు అవుననే చెబుతున్నాయి. రిజర్వేషన్లు ఖరారైన నాలుగు రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిని ప్రకటించేందుకు ఎమ్మెల్యే వేముల వీరేశం చేసిన ప్రయత్నాలు... బుజ్జగింపులు ఫలించలేదు. ఆఖరి చాన్స్ అంటూ ఒకరు...ఒక్క చాన్స్ అంటూ మరొకరు... ఇలా ఇద్దరూ సర్పంచ్ స్థానానికి పోటీపై పట్టువీడకపోవడంతో అభ్యర్థి ఖరారులో చిక్కుముడి వీడక ఉత్కంఠనే రేపుతోంది. అభ్యర్థి ఎంపికపై ఎమ్మెల్యే సూచన మేరకు త్రీమెన్ కమిటీ చేసిన ప్రయత్నం కూడా ఫలించలేదు.

ఫ్రెండ్లీ కాంటెస్ట్‌కు ఒప్పుకొని నాయకులు

ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేయండని త్రీమెన్ కమిటీ నేతలు సూచించినా ససేమిరా అన్నట్లు తెలిసింది. ఇద్దరిలో ఎవరో ఒకరిని మాత్రమే పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేస్తున్నట్లు ఎమ్మెల్యే అధికారిక ప్రకటన చేయాలనే వారిద్దరూ కోరినప్పటికి అది సాధ్యపడకపోవడంతో చివరి రోజైన శనివారం ఆ ఇద్దరూ నామినేషన్లను దాఖలు చేశారు. ఆ ఇద్దరూ కూడా తాము ఎమ్మెల్యే బలపర్చిన అభ్యర్థినని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ కేడర్‌లో అయోమయానికి తెరలేపింది. కాంగ్రెస్‌లో నెలకొన్న ఈ రాజకీయ అనిశ్చితితో ఇపుడు మండలంలోని అందరి దృష్టి నార్కట్‌పల్లి పైనే పడింది. నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఈ పర్యాయం బీసీ జనరల్‌కు రిజర్వ్ అయింది. దీంతో ఈ స్థానానికి మొదటి నుంచి నలుగురు కాంగ్రెస్ నేతలు బరిలో ఉన్నారని ప్రచారం జరిగినా నామినేటెడ్ పదవులతో ఒకరు తప్పుకోగా చివరకు మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్యయాదవ్, నార్కట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెరిపోతుల భరత్‌గౌడ్ ఇద్దరే సర్పంచ్ సీటుపై ఇంతకాలం ఆశలు పెట్టుకున్నారు. ఇద్దరూ పార్టీలో క్రియాశీలకంగా ప్రయత్నలోపం లేకుండా ఎవరి హోదాలో వారు పనిచేస్తూ ప్రజలకు దగ్గరయ్యారు. ఇదిలా ఉంటే తనకూ సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ జాల మంజుల (సీతక్క) సైతం నామినేషన్ వేసింది. కాగా సర్పంచ్ అభ్యర్థిత్వంపై స్థానిక పార్టీ నాయకత్వం ఒకరివైపే నిలబడి సుదీర్ఘ చర్చలు జరిపినా ఖరారు చేయలేకపోయారు. పార్టీ పరంగా ఇప్పుడే ఒక అభ్యర్థిని ప్రకటిస్తే మిగతా ఇద్దరు ఇతర పార్టీ మద్దతుతో పోటీ చేయనున్నారనే ప్రచారం నేపథ్యంలో పరిస్థితులను పార్టీకి అనుకూలంగా మలిచిన తర్వాతే కాంగ్రెస్ అభ్యర్థి పేరును అధికారికంగా ప్రకటించాలనే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో నార్కట్‌పల్లి కాంగ్రెస్‌లో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

సమావేశాలను విజయవంతం చేయాలి

మునుగోడురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, నలపరాజు వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ విద్యారంగ పరిరక్షణ ధ్యేయంగా తిప్పర్తి మండల కేంద్రంలోని కేఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

బొట్టుగూడ హైస్కూల్ నూతన భవన ఏర్పాటు హర్షనీయం

నల్లగొండటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బొట్టుగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టడం హర్షనీయమని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బొట్టుగూడ పాఠశాల పూర్వ విద్యార్థులైన జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ హఫీజ్‌ఖాన్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్.రఘుప్రసాద్, అడిషనల్ ఎస్పీ పూర్ణచందర్, సమాచారశాఖ జేడీ కన్నెకంటి వెంకటరమణ, అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ హలీం, గొట్టిపర్తి వేణుగోపాల్, ఏ.విశ్వేశ్వర్‌రావు మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు.

రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండ, రామగిరి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లు శనివారం ఎంపీ రఘువీర్‌రెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రేషన్ డీలర్లకు రూ.5వేల గౌరవవేతం ఇవ్వాలని, ప్రతీ క్వింటాకు మూడు వందల చొప్పున కమీషన్ ఇస్తామన్నా హామీ ఇప్పటికీ నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రాజా రమేష్, వేణుగోపాల్, సముద్రాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి బస్సు చార్జీలు పెంచొద్దు

నార్కట్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా సొంత గ్రామాల్లోకి వెళ్లే ప్రయాణికులపై భారం పడేలా బస్సుల్లో చార్జీలు పెంచవద్దని రాష్ట్రీయ శివాజీ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తాడోజు శ్రీనివాసచారి, హిందూ జనజాగృతి చేతన్ గాడి, హిందూ సంఘాల జేఏసీ సమన్వయకర్త రఘువీర్‌ప్రవీణ్ దూబే కోరారు. శనివారం ఆ సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ ఎండీ, రవాణా శాఖ జాయింట్ కమిషనర్‌లకు వినతిపత్రం అందజేశారు. రానున్న సంక్రాంతి పండుగకు అదనపు చార్జీలు పెంచవద్దని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు పగడాల వేణుగోపాల్, శశి తదితరులు పాల్గొన్నారు.

తొలివిడత నామినేషన్ల ఘట్టం ముగిసింది

(5వ పేజీ తరువాయి)

పోలింగ్ డిసెంబరు 14వ తేదీన ఉదయం 7 గంటలను నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అదేరోజు 2 గంటల నుంచి కౌంటింగ్ అనంతరం ఫలితాను ప్రకటిస్తారు. అదేరోజు ఉపసర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు.

అసలేం జరుగుతోంది!

(5వ పేజీ తరువాయి)

చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, బదిలీ అయిన వారు తిరిగి అక్రమ డిప్యూటేషన్లు పొందుతున్నారు.

ఏజీ ఆడిట్ అకౌంట్ అధికారులకు తప్పుడు సమాచారం

ఇటీవల జిల్లా పరిషత్‌కు ఏజీ ఆడిట్ అధికారుల బృందం రాగా, వారిని సైతం తప్పుదోవ పట్టించే విధంగా కొందరూ ఉద్యోగులు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివాసం ఉన్న వారికి హెచ్ఆర్ఏ (ఇంటి అద్దె భత్యం) చెల్లించడానికి వీలుండదు. కానీ, కొందరూ క్వార్టర్స్‌లోనే నివాసముంటూ అక్రమంగా హౌస్‌రెంట్ అలవెన్స్ తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సైతం ఇదేవిధంగా హెచ్ఆర్ఏను తీసుకున్న సమయంలో విచారణ వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ క్వార్టర్స్‌లో కాకుండా ప్రైవేట్‌గా అద్దె తీసుకొని ఉంటే ఇంటి అద్దె భత్యాన్ని తీసుకోవచ్చు. కానీ, అందుకు విరుద్ధ పరిస్థితులు ఉన్నట్లు వినికిడి. నాలుగు రోజుల క్రితం అకౌంట్స్ ఆఫ్ జనరల్ ఆడిట్ బృందం జడ్పీలో ఆడిట్ నిర్వహించినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. క్వార్టర్స్‌లో నివాసం ఉన్నప్పుడు హెచ్ఆర్ఏను ఎలా చెల్లిస్తున్నారని ఆడిట్ అధికారులు ప్రశ్నించగా, ఖంగుతిన్న జడ్పీ ఉద్యోగులు అలాంటిది ఏమీలేదని, క్వార్టర్స్‌లో ఎవరూ ఉండటం లేదని సమాధానం ఇచ్చినట్లు వినికిడి. అయితే క్వార్టర్స్‌కు సంబంధించిన కరెంట్ బిల్లు వేల రూపాయలు ఎందుకు వస్తోందని ఆడిట్ అధికారులు ప్రశ్నించడంతో జడ్పీ ఉద్యోగులు మిన్నుకుండి పోయినట్లు సమాచారం. క్వార్టర్స్‌లో ఉన్న వ్యక్తులు విద్యుత్ వినియోగిస్తేనే బిల్లు వస్తుంది కదా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. అయినా జడ్పీ ఉద్యోగులు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు ఆడిట్ అధికారులు గుర్తించారని విశ్వసనీయంగా తెలిసింది.

ఎవరి విధులు వారే నిర్వహిస్తున్నారు

జిల్లా పరిషత్‌తో పాటు జడ్పీ పరిధిలోని అన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో ఎవరి విధులు వారే నిర్వహిస్తున్నారు. ఎక్కడా అక్రమ డిప్యూటేషన్లు లేవు. నిబంధనల మేరకే సెక్షన్లలో పనిచేస్తున్నారు. ఎవరిపై ఎవరూ పెత్తనం చేయడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పరిపాలన సాగుతోంది. నిబంధనలకు అనుగుణంగా కార్యాలయాల్లో పనులు నడుస్తున్నాయి.

- శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

నాంపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్‌లో ఎలాంటి అవకతవకలు లేకుండా సజావుగా, సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబరు 11వ తేదీన జరిగే గ్రామపంచాయతీ పోలింగ్‌పై ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ పోలింగ్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా సమర్థవంతంగా పోలింగ్ నిర్వహించాలని కోరారు. మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్ శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో మర్రిగూడ, నాంపల్లి ఎంపీడీవోలు మునయ్య, రామకృష్ణ, తహసీల్దార్లు శ్రీనివాస్, దేవసింగ్, ఎంఈవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.


మర్రిగూడలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీదేవి

నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

మర్రిగూడ: నామినేషన్ల ప్రక్రియను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సజావుగా నిర్వహించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. శనివారం నామినేనషన్ల ముగింపు సందర్భంగా మండలంలోని ఎరగండ్లపల్లి, మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాలను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులు వేసిన నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి తప్పుడు తడకలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆమెవెంట ఎన్నికల జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి ఎంపీడీవో మున్నయ్య, తహసీల్దార్ జక్కరి శ్రీనివాస్, ఎంపీవో రవి కుమార్, ఎంఈవో శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

చిట్యాలరూరల్: స్థానికసంస్థల ఎన్నికల్లో భాగంగా వార్డు, సర్పంచ్ స్థానాలకు జరిగే పోలింగ్‌ను పీవోలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో జయలక్ష్మి అన్నారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో పీవోలదే కీలకపాత్ర అని, పోలింగ్ మొదలుకొని ఫలితాలు వెల్లడించే జాగ్రత్తగా ఉండాలన్నారు. పీవోలకు శిక్షకులు సుధాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ విధులు, పోలింగ్ గురించి శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ గంపల మనోహర్, మౌనిక, భరత్, శ్రీను, గఫూర్, పీవోలు తదితరులు పాల్గొన్నారు.

కనగల్: ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు కనగల్ రైతు వేదికలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎన్నికల రోజు పోలింగ్ నిర్వహణలో పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ఎంపీడీవో వేదరక్షిత మాట్లాడుతూ ఎన్నికలు పొరపాట్లు లేకుండా పారదర్శకంగా పోలింగ్‌ను నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పద్మ, ఎంపీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండల కేంద్రం కేతేపల్లిలోని రైతువేదికలో శనివారం ఎన్నికల అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనర్ ఆఫ్ ట్రైనింగ్ శ్రీధర్‌రెడ్డి ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సిన, చేయకూడని పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రెసిడింగ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ట్రైనింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీదేవి అన్నారు. మునుగోడులో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల కేంద్రాన్ని తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహీసల్దార్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.


కేతేపల్లి: అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి


చిట్యాల: శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయలక్ష్మి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో వేదరక్షిత

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- టీజీజీవీబీ ఏజీఎం విజయ్‌భాస్కర్

నార్కట్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ సైబర్ మోసాలపై బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు (టీజీజీవీబీ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.విజయ్‌భాస్కర్ అన్నారు. నార్కట్‌పల్లిలోని టీజీజీవీబీ శాఖలో శనివారం సైబర్ సెక్యూరిటీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బ్యాంకు సిబ్బంది ఎవరూ ఎప్పుడు కూడా ఓటీపీ నెంబర్ చెప్పమని ఫోన్‌లో అడగరని, అలాంటి కాల్స్‌పై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవేళ ఎమరుపాటులో ఉండి మీరు ఓటీపీ చెబితే మీ బ్యాంకు ఖాతాను సైబర్ మోసగాళ్లు హ్యాక్ చేసి మీ ఖాతాలోని డబ్బును డ్రా చేస్తారని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలతో ఎంతో మంది బాధితులు బ్యాంకులను ఆశ్రయిస్తున్నారని, అందుకే ప్రతీ బ్యాంకులో ఈ తరహా సైబర్ సెక్యూరిటీ మోసాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకులో మీ ఖాతా లావాదేవీలు లేదా ఖాతాపుస్తకంలో ఎలాంటి మార్పులు చేర్పులైనా బ్యాంకులో సిబ్బందిని సంప్రదించి జాగ్రత్తపడాలని సూచించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు టీజీజీవీబీ సదా కృషి చేస్తుందని విజయ్‌భాస్కర్ అన్నారు. ఈ సదస్సులో బ్యాంకు శాఖ మేనేజర్ శాతం ప్రభాకర్, క్యాషియర్, ఫీల్డ్ ఆఫీసర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏజీఎం బి.విజయభాస్కర్

వరి కొయ్యలను కాల్చడంతో తగ్గనున్న భూసారం : ఏవో

కేతేపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొయ్యలను కాల్చడం వల్ల భూసారాన్ని దెబ్బతీయడేమని ఏవో బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని ఉప్పలపహాడ్, చీకటిగూడెం గ్రామాల్లో శనివారం క్షేత్ర పర్యటనలు చేసి వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే అనర్థాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోత తర్వాత మిగిలే వరి కొయ్యలను కాల్చకుండా పొలంలో కలియదున్నడం ప్రయోజనకరమన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమిలో ఉండే మిత్ర పురుగులు, వానపాముల, ఇతర సూక్ష్మజీవులు చనిపోయి భూమి నిస్సారమవుతుందన్నారు. ఒక టన్ను వరి గడ్డిలో 6కిలోల నత్రజని, కిలోన్నర ఫాస్పరస్, 10-12 కిలోల పొటాష్ ఉంటుందన్నారు. ఎన్నో పోషకాలు కలిగిన వరి కొయ్యలను కాల్చవద్దని అన్నారు. వరి కొయ్యలు దుక్కిలో త్వరగా కలిసి పోయేందుకు ఎకరాకు రెండు బస్తాల ఎస్ఎస్‌పి ఎరువు వేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈవోలు బాలరాజు, ఉమేష్, రైతులు గోగుల వెంకన్న, కప్పల ప్రభాకర్, సైదులు, మమత తదితరులు ఉన్నారు.


నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ


నార్కట్‌పల్లిలో నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ

నార్కట్‌పల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి శనివారం సందర్శించారు. కేంద్రంలో నామినేషన్ల దాఖలు తీరును తెలుసుకున్నారు. హడావుడి చేయకుండా ప్రశాంత వాతావరణం లో నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలని రాజకీయ నాయకులకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. మండలంలో మొత్తం ఎన్ని క్లస్టర్ కేంద్రాల ఉన్నాయి ఎక్కడెక్కడ ఎంత మంది పీసీలను బందోబస్తు కోసం నియమించారని ఎస్ఐ క్రాంతికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

తహసీల్దార్ పరిశీలన: మండలంలోని నార్కట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడెం తదితర గ్రామాల్లోని నామినేషన్ క్లస్టర్ కేంద్రాలను తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు శనివారం పరిశీలించారు. నామినేషన్లు దాఖలవుతున్న తీరును విధుల్లో ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ పత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సిబ్బంది జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ తరుణ్‌కుమార్ ఉన్నారు.

సైన్స్ ఒలంపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్మాత్మకంగా నిర్వహించిన నేషనల్ సైన్స్ ఒలంపియాడ్‌లో పట్టణంలోని శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. శనివారం టెస్ట్‌లో పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థులు బి.అక్షిత్‌రెడ్డి, కె.ఆరాధ్య, పి.వర్షిణి, 7 తరగతి విద్యార్థులు బి.షర్మిల, బి.అవంతిక, వై.శ్రావణి, 8వ తరగతి విద్యార్థులు పి.చరణ్ తేజ్, కె.సాయిచరణ్, డి.హరీష్‌నాయక్, 9వ తరగతి విద్యార్థులు ప్రేమ్‌కుమార్, ఎన్. రుచిత, ఎం.లిఖిత్ కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ యాదయ్య మెమోంటోలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు యాదయ్య, త్రిమూర్తి, నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పట్టాభి సీతారామచంద్రస్వామి కల్యాణం

నార్కట్‌పల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర-కక్కిరేణి గ్రామాల మధ్యన అనంత స్వర్ణగిరిపై ఉన్న పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం నవమి తిథిని పురస్కరించుకుని స్వామివారి మాస కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. సీతారామచంద్రుల కల్యాణోత్సవాన్ని అర్చకస్వాములు శాస్త్రబద్ధంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై వేడుకను తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో దేవస్థాన నిర్మాణదాతలు ఉండ్ర లింగారెడ్డిభాగ్యమ్మ దంపతులు పాల్గొన్నారు.

విద్వేషపూరిత పోస్టులు చేస్తే కఠినచర్యలు

కనగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యం లో సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజీవ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోషల్‌మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఎన్నికల కోడ్ అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

చివరి రోజు జోరుగా నామినేషన్లు

- పలు చోట్ల రాత్రి వరకూ కొనసాగిన ప్రక్రియ

కేతేపల్లి, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నామినేషన్లకు చివరి రోజైన శనివారం సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మండలంలోని 16 గ్రామాల్లో తొలి విడతలో నిర్వహించే పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు మండల కేంద్రం కేతేపల్లి, కొత్తపేట, తుంగతుర్తి, ఇనుపాముల, చెర్కుపల్లి గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని 16గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన క్లస్టర్లు నామినేషన్ వేసే వారితో సందడిగా మారాయి. ఆయా కేంద్రాల్లో గురు, శుక్రవారాల్లో నామినేషన్లు దాఖలు చేసిన వారు శనివారం చివరి రోజు అదనంగా మరో సెట్ నామినేషన్ వేయడంతో పాటు కొత్త వారు నామినేషన్లు వేసేందుకు వచ్చారు. దీంతో ఆయా క్లస్టర్లలో నామినేషన్ల ప్రక్రియ శనివారం రాత్రి పొద్దుపోయే వరకూ సాగింది. శనివారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ కేంద్రానికి వచ్చిన వారి నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. ఐదు క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణను ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మిలు పర్యవేక్షించారు.

ఎన్నికల్లో పోటీకి యువత ఆసక్తి

స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యులు, సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు యువత ఆసక్తిని కనబరుస్తున్నారు. నామినేషన్ల దాఖలు చివరిరోజు కావడంతో మండలంలోని 18 గ్రామాల్లో యువత పోటీ చేసేందుకు ముందుకు వస్తున్నారు. వార్డు సభ్యులుగా, సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. వట్టిమర్తిలో వార్డు సభ్యుడిగా పోటీ చేసేందకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ గ్రామ 8వ వార్డు సభ్యుడి కోసం నామినేషన్‌ను దాఖలు చేశారు.

చెర్కుపల్లి సర్పంచ్ పదవికి నేతి సతీమణి నామినేషన్

మండలంలో జనరల్ మహిళకు రిజర్వు చేసిన చెర్కుపల్లి గ్రామ సర్పంచ్ పదవికి శాసనమండలి మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ సతీమణి నేతి కమలమ్మ నామినేషన్ దాఖలు చేశారు. 20 ఏళ్ల క్రితమే కమ్మలమ్మ చెర్కుపల్లి సర్పంచ్ పదవిని చేపట్టింది. ప్రస్తుతం మరోసారి కమలమ్మ నామినేషన్ వేసిన నేపథ్యంలో సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేస్తారనే చర్చ జరుగుతుంది. సర్పంచ్ పదవి కోసం మొత్తం నలుగురు నామినేషన్లు వేసినా నామినేషన్ల ఉపసంహరణ నాటికి సర్పంచ్ పదవి ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

రాత్రి వరకు కొనసాగింపు

చిట్యాలరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్‌ల దాఖలకు శనివారం నామినేషన్ కేంద్రాల వద్ద పలు గ్రామాల్లో అభ్యర్థులు బారులుదీరారు. అంతేకాకుండా సమయం మించిపోవడంతో రాత్రి వరకు నామినేషన్లు కొనసాగాయి. మూడు గ్రామాలను కలిపి 6 క్లస్టర్లుగా ఏర్పాటు చేయగా ఆయా గ్రామస్థులు ఒకేసారి నామినేషన్‌ను వేసేందుకు అధిక సంఖ్యలో రావడంతో నామినేషన్ కేంద్రాలు రద్దీగా మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో నామినేషన్ల స్వీకరణ రాత్రి వరకు జరిగింది. నామినేషన్ పత్రాలను తీసుకువచ్చిన అభ్యర్థులు అధికంగా ఉండటంతో గుండ్రాంపల్లి, వెలిమినేడు, పెద్దకాపర్తితో పాటుగా పలు గ్రామాల్లో అధికారులు వారికి వరుస క్రమంలో నంబర్లను కేటాయించి, చీటీలు ఇచ్చి వరుసలో రావాలని సూచించారు. దీంతో అభ్యర్థులు ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల ముందు వరుసగా వేచి ఉండి అక్కడే కూర్చున్నారు.


దామెర భీమనపల్లిలో నామినేషన్ల కోసం క్యూ కట్టిన అభ్యర్థులు

మర్రిగూడ: వార్డు సభ్యులు, సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులు నామినేషన్ల కేంద్రాల ముందు క్యూ కట్టారు. కేంద్రాల వద్దకు అభ్యర్థులు వారి మద్దతుదారులతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. 5 క్లస్టర్ పరిధిలో రాత్రి 7గంటల వరకు కొనసాగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

చండూరురూరల్: చండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన గిరి కరుణాకర్, భీమారపు నర్సింగ్ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. ఎంతో అట్టహాసంగా ర్యాలీతో వచ్చి తమ నామినేషన్ పత్రాలను అందజేశారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	581.10 (286.1875)	49,357	48,357
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.17 (4.24)	608.67	701.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.045)	2,100	2,000

చికెన్ ధరలు | లైవ్: రూ.130 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.230



నల్లగొండ మండలం కంచనపల్లిలో నామినేషన్ల కేంద్రం

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. నామినేషన్లను ఆదివారం పరిశీలించనుండగా, నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబరు 3వ తేదీ వరకు గడువు ఉంది. పోలింగ్‌ను 11వ తేదీన ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

తొలి విడత నామినేషన్ల ఘట్టం ముగిసింది

- నేడు నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు 3వ తేదీ వరకు గడువు

జిల్లాలో తొలి విడతలో చండూరు, నల్లగొండ డివిజన్లకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ పూర్తి కావడంతో అధికార యంత్రాంగం నామినేషన్ల పరిశీలన, చెల్లిన నామినేషన్ల ప్రకటనతో పాటు అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం కార్యక్రమం చేపట్టనుంది. అనంతరం నామినేషన్ల ఉపసంహరణ జరిగిన డిసెంబరు 3న అభ్యర్థులను ప్రకటించి, వారికి గుర్తులను కేటాయిస్తారు. మొదటి విడతలో 14 మండలాల్లోని 318గ్రామాల సర్పంచ్ స్థానాలకు, 2,870 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. చిట్యాల, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, నకిరేకల్,నల్లగొండ, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, తిప్పర్తి, చండూరు, గట్టుప్పల్, మర్రిగూడ, మునుగోడు, నాంపల్లి మండలాల్లో తొలివిడత ఎన్నికలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి రెండో విడతకు నామినేషన్లు...

జిల్లాలోని మిర్యాలగూడ డివిజన్‌లో రెండో విడత ఎన్నికలకు సంబంధించి 10 మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ డివిజన్‌లోని 282 సర్పంచ్ స్థానాలకు, 2,418 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల, మాడ్గులపల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి (సాగర్), త్రిపురారం, వేములపల్లి మండలాల్లో రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించి ఆదివారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనుండగా, ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుంది. డిసెంబరు 2వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 6వ తేదీ వరకు గడువు ఉంటుంది. అదేరోజు అభ్యర్థులను ప్రకటించి గుర్తులను కేటాయిస్తారు....

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ — 3వ రోజు

జిల్లా	29న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	1483	2289	5845	6854
సూర్యాపేట	500	866	3000	3180
యాదాద్రి	440	844	1776	2450
మొత్తం	2423	3999	10621	12484

అసలేం జరుగుతోంది!

- అక్రమ డిప్యూటేషన్లు పొందిన వారిదే సర్వం పెత్తనం
- పాఠశాలలు, ఎంపీడీవో కార్యాలయాల్లో సైతం అదే తంతు
- హెచ్ఆర్ఏపై ఏజీఆడిట్ అధికారులను తప్పుదోవ పట్టించిన వైనం
- పరిపాలనా విభాగంలో ఇష్టారాజ్యం
- జిల్లా పరిషత్‌లో ఉద్యోగులు, అధికారుల మధ్య కోల్డ్‌వార్

జిల్లా పరిషత్‌లో కొందరూ అధికారులు, ఉద్యోగుల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. కార్యాలయంలో ఎవరికి వారేగా వ్యవహరిస్తుంటడంతో పాలనపై ప్రభావం కన్పిస్తోంది. కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా కార్యాలయాలకు వచ్చిపోతున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



కార్యాలయంలో అక్రమ డిప్యూటేషన్లు పొందిన వారు పలు సెక్షన్లలో కర్రపెత్తనం సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంతో పాటు ఆ తరువాత ఇష్టానుసారంగా డిప్యూటేషన్లు పొందినవారిదే రాజ్యమైంది. ఉమ్మడి జిల్లాలో జరిగిన అంతర్గత బదిలీల సందర్భంలో వీరు అక్రమంగా డిప్యూటేషన్లు పొందారు. జాతీయ రహదారిపై ఉన్న ఓ నియోజకవర్గంలోని రెండు మండలాలకు బదిలీపై వెళ్లిన వారు తిరిగి అక్రమ డిప్యూటేషన్లతో జడ్పీకి వచ్చి పూర్వ సెక్షన్లలోనే పని చేయడం వివాదాస్పదంగా మారుతోంది. వాస్తవానికి ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు బదిలీ అయినప్పుడు వారిని తిరిగి అక్రమంగా డిప్యూటేషన్ తీసుకోకూడదనే నిబంధన ఉంది. కానీ, అందుకు భిన్నంగా అక్రమంగా డిప్యూటేషన్లు కల్పించడం గమనార్హం.

పరిపాలనా విభాగంలో సైతం

జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన విభాగంలో అధికారులు, ఉద్యోగులు తోచినట్టు వ్యవహరిస్తున్నారని, నచ్చని ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జడ్పీలో అక్రమ డిప్యూటేషన్లు పొందిన వారు పాత సెక్షన్లలో తిష్ట వేయగా పలువురు ఎంపీడీవో కార్యాలయాలు, పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లు పొందడం గమనార్హం. జడ్పీ పరిధిలో ఎంపీడీవో కార్యాలయాలు ఎంతో కీలకమైనవి కాగా, అక్కడా పాలన దారితప్పే విధంగా డిప్యూటేషన్లు వేశారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సైతం ఇవే పరిస్థితులు ఉన్నాయి. అదేవిధంగా అధికారులు, ఉద్యోగుల మధ్య సఖ్యత లేకపోవడం కూడా సమస్యగా మారుతోంది. సెక్షన్లలో మార్పులు, చేర్పులు, సర్దుబాటు సమయంలో వారికి అనుకూలమైన వారికి బాధ్యతలు ఇవ్వడం, నచ్చని వారిని దూరం పెట్టడం వివాదానికి దారితీస్తోంది. అనుభవం, సీనియర్లను దృష్టిలో ఉంచుకొని సెక్షన్ల బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా, కీలకమైన శాఖల్లో అనుభవం లేనివారికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. అనుభవం ఉన్న వారిని అప్రాధాన్య స్థానాలకు పరిమితి చేయడంతో అధికారులు, ఉద్యోగుల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతోంది. ఇప్పటికే గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉద్యోగులకు బాధ్యతలు ఇచ్చారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమయంలో జడ్పీ ఉద్యోగులకు మరిన్ని అదనపు బాధ్యతలు ఉంటాయి. అనుభవం లేని వారికి ప్రాధాన్య శాఖలు కేటాయించడంతో ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. కీలకమైన విభాగాల్లో ఏళ్ల తరబడి తిష్టవేసిన ఉద్యోగులను బదిలీ...

- మిగతా 8వ పేజీలో...

అర్హులందరికీ ఉపకార వేతనాలు వచ్చేలా చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ప్రీ మెట్రిక్ , పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు పొందే విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకు తక్షణమే ఎంఈఓలు, హెడ్మాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. హెడ్మాస్టర్లు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి స్కాలర్‌షిప్‌ల విషయాన్ని వారికి తెలియజేసి స్కాలర్‌షిప్స్ పొందేందుకు అవసరమైన ఆధార్, బ్యాంకు ఖాతా, కులం, ఆదాయ ధ్రువపత్రాలు వంటివి సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కాలర్‌షిప్‌ల మంజూరు విషయంలో బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు బ్యాంక్ అధికారులతో మాట్లాడాలని, కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీ విషయంలో తహసీల్దార్‌తో మాట్లాడిన తర్వాత సమస్య ఉంటే నేరుగా రెవెన్యూ అదనపు కలెక్టర్‌కు తెలియజేయాలన్నారు. ఎంఈవోలు ఒక చెక్ లిస్టు ను తయారు చేసుకుని చెక్ లిస్టు ప్రకారం అన్ని ధ్రువపత్రాలు, ఫొటోతో సహా ఆన్‌లైన్ చేయాలని, స్కాలర్‌షిప్‌లు పొందడం విద్యార్థుల హక్కు అని అన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలని ఆదేశించారు. ఎంఈఓల సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఎంఈఓ లకు షోకాజు నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, సాంఘిక సంక్షేమ డీడీ శశికళ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, ఎల్‌డీఎం శ్రామిక్ పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి

కట్టంగూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి అన్నారు. కట్టంగూరు మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఎన్నికల నిర్వహించాలని సూచించారు. స్థానిక కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమిత్‌నారాయణ, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీపీవో కొండా వెంకయ్య, మండల ప్రత్యేక అధికారి సతీష్‌రెడ్డి, ఎంపీడీవో జ్ఞానప్రకాష్‌రావు, తహసీల్దార్ పుష్పలత, ఎంపీవో స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలి: కలెక్టర్

తిప్పర్తి: అభ్యర్థుల నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. తిప్పర్తి మండల కేంద్రంతో పాటు మామిడాల, పజ్జూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న నామినేషన్ల ప్రక్రియను శనివారం ఆమె తనిఖీ చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు సమస్యలు ఎదురైతే హెల్ప్‌డెస్క్ ద్వారా వివరాలు పొందాలని సూచించారు. అదే విధంగా హెల్ప్‌డెస్క్ అందించే సేవలను తెలియజేయాలని అన్నారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఒక అభ్యర్థి ఎన్ని సెట్లు నా మినేషన్ పత్రాలు దాఖలు చేశారో వాటిని భద్రపరచాలని సూచించారు. అదే విధంగా అభ్యర్థులకు అవసరమయ్యే సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వచ్చిన నామినేషన్ దరఖాస్తులను టీపోల్ యాప్‌లో పొందుపరచాలని అన్నారు. మొదటి విడత నామినేషన్లకు శనివారం చివరి రోజు అయినందున 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో నామినేషన్లను అనుమతి ఇచ్చేది లేదని పేర్కొన్నారు. సమయం పూర్తయిన తర్వాత నామినేషన్ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరంలో ఉంచాలన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని తెలిపారు. ఆమె వెంట జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుధాకర్, ఆర్ఐ ధ్రువఅర్జున్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కట్టంగూరులో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కొర్ర లక్ష్మి

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుచేయాలి

నల్లగొండటౌన్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల్లో ఏ చిన్న నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె నల్లగొండ మండలంలోని దండంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని అన్నారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణకు శనివారం చివరి గడువు పూర్తయినందున 5 గంటలలోపు నామినేషన్ కేంద్రంలోకి వచ్చిన వారికి అనుమతి ఇవ్వాలన్నారు. 5 గంటల తర్వాత ఎలాంటి నామినేషన్లను అనుమతించవద్దని, నామినేషన్ల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, ఎంపీడీవో యాకూబ్‌నాయక్ ఉన్నారు.

'ప్రజావాణి' రద్దు

నల్లగొండ (కలెక్టరేట్): గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 17 వరకు గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, అప్పటి వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మిర్యాలగూడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో అప్రమత్తంగా వున్నట్లే వ్యక్తిగత ఆరోగ్యం విషయంలోనూ పోలీసులు శ్రద్ధ వహించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శనివారం మిర్యాలగూడ ఎంవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో అపోలో, రెనోవా, మాక్స్‌విజన్‌ఐ, క్లోవ్ డెంటల్, రెయిన్‌బో చిల్డ్రన్స్, నల్లగొండ ఐఎంఏ సహకారంతో పోలీసు ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఆయన సందర్శించారు. సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజులతో కలిసి రోగనిర్ధారణ పరీక్షలు,మందుల పంపిణీ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. మొత్తం 442 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.40మందిలో సివియర్ వ్యాధులు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు నాగభూషణం, సోమనర్సయ్య, పీఎన్‌డి.ప్రసాద్, శ్రీనునాయక్, మిర్యాలగూడ, దేవరకొండ సబ్‌డివిజన్ ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

దేవరకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 6న పర్యటన ఖరారైంది. ముఖ్యమంత్రి బహిరంగ సభతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అందుకుగాను శనివారం దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావులు ముఖ్యమంత్రి సభ స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సభ స్థలాన్ని, ముదిగొండ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉన్న హెలిప్యాడ్ స్థలాన్ని ఆర్డీవో రమణారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్‌రెడ్డిలు పరిశీలించారు. సీఎం సభ ఎక్కడ నిర్వహించాలనేది త్వరలో నిర్ణయించనున్నట్లు అధికారులు తెలిపారు.

కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించాం



తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేసి ప్రత్యేక తెలంగాణ సాధించామని జడ్పీ మాజీ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్ అన్నారు. శనివారం దీక్షా దివస్ సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నవంబరు 29న దీక్షా దివస్ ఎంతో ముఖ్యమైనదని అన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి మొక్కవోని పట్టుదలతో దీక్షచేసి ఢిల్లీ మెడలు వంచిన రోజు అన్నారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షతో కేంద్రం కదలి వచ్చిందన్నారు. తెలంగాణ సాధన కోసం 11 రోజుల పాటు ఆమరణ దీక్ష చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి దేవుడని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో పదేళ్ల పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో పాటు అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్‌నాయక్, కటికం సత్తయ్యగౌడ్, చెరుకు సుధాకర్‌గౌడ్, మందడి సైదిరెడ్డి, మాలే శరణ్యారెడ్డి, నిరంజన్‌వలీ, పల్లె రవికుమార్, ప్రసన్నరాజ్, బోనగిరి దేవేందర్, కొండూరు సత్యనారాయణ, మైనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్కంపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలు విడుదల



అక్కంపల్లిలో చేపలు విడుదల చేస్తున్న మత్స్యశాఖ ఏడీ రాజారాం

పెద్దఅడిశర్లపల్లి,నవంబరు29(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మత్స్యకారులకు సబ్సిడీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్య శాఖ ఏ.డీ రాజారాం అన్నారు. మండలంలోని అక్కంపల్లి రిజర్వాయర్‌లో 12 లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ సభ్యుల ఆధ్వర్యంలో చేపపిల్లను రిజర్వాయర్‌లో శనివారం వదిలారు. ముందుగా రిజర్వాయర్‌కు పూజలు నిర్వహించి అనంతరం చేప పిల్లలను చెరువులో వదిలారు. రవ్వ, బొచ్చ, మిరగాలు చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలినట్లు వారు తెలిపారు. 100 శాతం రాయితీతో ఇచ్చే చేప పిల్లలను ప్రతి మత్స్యకార సభ్యులు సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. ప్రతి చెరువుకు నాణ్యమైన చేప పిల్లలను సరఫరా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,100 చెరువులకు 5.98 కోట్ల చేప పిల్లలను విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ఆయన తెలిపారు. నెల రోజుల నుంచి జిల్లాలో చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 50 శాతం చేప పిల్లలను చెరువులో విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. 10-15 రోజుల్లో మిగిలిన చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చేప పిల్లల సైజు బట్టి వేరుచేసి రికార్డు చేయడం జరుగుతుందన్నారు. మాజీ ఛైర్మన్ తాళ్ల మల్లయ్య, అమర్‌సింగ్, పవన్‌కుమార్, బాలు, తూ టిపల్లి సత్తయ్య, దండుగుల శ్రీను, మత్స్యకారుల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి నిధులిచ్చేది

కేంద్ర ప్రభుత్వమే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



చిన్నకాపర్తిలో బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్ గంగపురం భాస్కర్‌కు కండువా కప్పుతున్న జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి నిధులను ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని ఈవిషయాన్ని గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నకాపర్తి గ్రామ మాజీ సర్పంచ్ గంగాపురం భాస్కర్‌గౌడ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. వారికి వర్షిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వ నిధులే ముఖ్యకారణం ఆ విషయం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదన్నారు.

స్థానిక సంస్థలతో నే అభివృద్ధి సాధ్యమని అది తెలిసినా గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎన్నికలను నిర్వహించకపోవడంతో గ్రామాలు అభివృద్ధి లేక కుంటుపడిపోయాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గ్రామాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన వార్డు సభ్యులు, సర్పంచ్ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ గంగపురం భాస్కర్‌గౌడ్, మునుగోటి లింగయ్య, ఆకుల వెంకన్న, దేవరకొండ కృష్ణమాచారి, మామిడి సత్యనారాయణ, మామిడి నర్సింహ, కొండ లక్ష్మయ్య, మాదగోని శేఖర్‌గౌడ్, బొమ్మగాని నర్సింహ, మామిడి శ్రీను, గురుజ లింగయ్య, గురుజ నిఖిల్‌గౌడ్, లాల్‌కృష్ణ, బొమ్మగాని మదర్, కోనేటి రవి, దేశపాక శ్రీరాములు, మాధవని స్వామి, మాదగోని మధు, బొమ్మగాని సైదులు, రండి నర్సింహ, గంగాపురం నరేందర్, తిరుమలదాస్ సైదులు, పాకాల నర్సింహ, గురుజ గణేష్, జంగయ్య, కొత్త వెంకన్న, కొత్త భాస్కర్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మైల నర్సింహ, మాస శ్రీను, పాల్గొన్నారు.

మరమ్మతులకు 20ఏళ్లకు మోక్షం

7

తూములో గేటు అడ్డం తిరిగింది

ఇరుకైన వంతెనతో ఇక్కట్లు

● అదుపుతప్పితే అధోగతి ● సాగర్ ఎడమకాల్వపై శిథిలమైన కల్వర్టులు ● దెబ్బతిన్న రెయిలింగ్ ● ధ్వంసమైన రక్షణ గోడలు

దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టులు, వంతెనలు మరమ్మతులకు నోచడం లేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయకట్టు రైతాంగానికి సాగు, తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన నాగార్జునసాగర్ ఎడమకాల్వపై నిర్మించిన వంతెనల నిర్వహణను గాలికొదిలేశారు.

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)





సాగర్ ఎడమకాల్వపై ప్రమాదకరంగా మారిన వంతెన, వేములపల్లి ఊర చెరువు సమీపంలో ప్రమాదకరంగా వంతెన

నాటి పరిస్థితులకు అనుగుణంగా ఆయా గ్రామాల సమీపంలోని చెరువులు, వాగులపై కుడి, ఎడమ వైపు కట్టల పరిధిలో ఏర్పాటు చేసిన ఇరుకైన వంతెనలతో రైతులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రపంచబ్యాంకు నిధులతో సాగర్ ఎడమకాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టి కాల్వ లైనింగ్, కాల్వపై గల ఎత్తిపోతల మరమ్మతులు చేసిన అధికారులు శిథిలావస్థలో చేరుకోని రెయిలింగ్ దెబ్బతిని రక్షణ గోడలు ధ్వంసమైనా వాటి అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదు. దీంతో శిథిలమైన బ్రిడ్జీలపై ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాగర్ ఎడమకాల్వ నిర్మాణ సమయంలో వేములపల్లి ఎల్ 13, నియామత్‌ఖాన్, ఊరచెరువుల సమీపంలో, అదేవిధంగా రావులపెంట శివారులోని పాలేరువాగు, మూసీల వద్ద ఈటీలపై కుడివైపు బ్రిడ్జీలు ఇరుకుగా ఉన్నాయి. దీంతో సమీప గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని తరలించాల్సి వస్తే నేటికి వాగుల గుండానే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ఇరుకైన వంతెనలతో అవస్థలు పడుతున్నారు. దీంతో రైతులు తమ పొలాలకు ఎడ్లబండి, ట్రాక్టర్ల ద్వారా వెళ్లాలంటే సుమారు రెండు, మూడు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో పాటు వంతెనల రెయిలింగ్‌లు దెబ్బతినిపోవడంతో పాటు రక్షణ దిమ్మెలు సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి ద్వారా రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వంతెన ద్వారా రాకపోకలు సాగించే సమయంలో ఏ మాత్రం ఆదమరిచినా కాల్వలో పడిపోయి మృత్యువాత పడే అవకాశాలు లేకపోలేదు. ఈ ఇరుకైన వంతెనలు ఆధునీకరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పరిసర రైతులు, వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు వర్షాకాలంలో కాల్వ కట్టలు బురదమయంగా మారడంతో వంతెనలు ఇరుకుగా ఉండటంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెనలకు మరమ్మతులు చేపట్టి రెయిలింగ్, రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వంతెనలకు మరమ్మతులు చేపట్టాలి



దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికి తోడు వంతెనలకు ఏర్పాటు చేసిన రైలింగ్‌లు, రక్షణ దిమ్మెలు శిథిలమైపోయాయి. ఆధునికీకరణ పనుల్లో భాగంగా కట్టల మరమ్మతులు చేసిన అధికారులు వంతెనల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వాటిపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టాలి.

గుర్రం అనిల్‌రెడ్డి, వేములపల్లి

ప్రభుత్వానికి నివేదించాం

సాగర్ ఎడమకాల్వ కుడి, ఎడమ వైపు గల వంతెనలకు దెబ్బతిన్న రెయిలింగ్, రక్షణ గోడల మరమ్మతులకై ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై అనుమతి వచ్చినప్పుడు టెండర్లు పిలిచి మరమ్మతులు చేపడతాం. ఇరుకుగా ఉన్న వంతెనలను విస్తరింపచేయడం తమ పరిధిలో లేదు.

మాలు, డీఈ, ఎన్నెస్పీ మానిటరింగ్

ప్రశాంత పోలింగ్‌కు చర్యలు

● మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ డివిజన్‌లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని మొత్తం పోలింగ్ లోకేషన్లు 363లో 122 సమస్యాత్మకమని 241 జనరల్‌గా గుర్తించామన్నారు. 10మండలాల్లో 2,418 పోలింగ్ కేంద్రాల్లో 917 సమస్మాత్మకమైనవిగా గుర్తించినట్లు చెప్పారు. 272 మందిపై రౌడిషీట్‌లలో 50 మందిపై షీట్లు జిల్లా ఎస్పీ ఎత్తివేవేశారని, మరో 222 మంది రౌడి షీటర్లుగా ఉన్నారన్నారు. గన్‌లైసెన్స్ పొందిన వారు 23 మంది ఉండగా అందులో బ్యాంకు సెక్యూరిటీలకు నాలుగు కేటాయించగా, 19 మంది వ్యక్తులు గన్‌లైసెన్స్‌లు పొందిన వారు ఎన్నికల సందర్భంగా డిపాజిట్ చేశారన్నారు. గతంలో జరిగిన ఉప ఎన్నికలు, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో డివిజన్‌లో రీపోలింగ్ సమస్య తలెత్తలేదని ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలుచేస్తూ ప్రజల మధ్యే ఉండి పనిచేసే వారిని గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పాదూరి శశిధర్‌రెడ్డి, రవినాయక్, పరుశరాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్, ఆయూబ్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

గుర్రంపోడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మొదటి సభ్యత్వాన్ని ఎంపీడీవో మహేష్‌కు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మర్యాద శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు మోపూరి భద్రారెడ్డి, బషీరొద్దిన్, అజ్మత్‌అలీ, నాగరాజు, శ్రీనివాస్, సంపత్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌మైనొద్దిన్, మధుసూదన్‌రెడ్డి, ఆయా సంఘాల నేతలు పాల్గొన్నారు.

బసిరెడ్డిపల్లి సర్పంచ్ ఏకగ్రీవం ?

పెద్దవూర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఏకగ్రీవమైనట్లు సమాచారం. బసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఎస్సీ మహిళకు కేటాయించారు. నామినేషన్ల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుండగా ముందుగానే శనివారం గ్రామస్థులంతా కలిసి మూకుమ్మడిగా తుడుం శ్రావణిరాకేష్‌ను సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలుస్తోంది.

వైభవంగా రాములోరి కల్యాణం

దేవరకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని తుల్జామ్మకుంట శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 28 మండలపూజ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి సుప్రభాతసేవలు, సీతారామచంద్రస్వామి ఎదుర్కోళ్లు, సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటి అధ్యక్షుడు బూషరాజు యాదగిరి గురుస్వామి, గెల్వయ్యస్వామి, ఎన్ఎన్ చారి, గణేష్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● నాట్కో ఫార్మా హెడ్ వీరనారాయణ

నాగార్జునసాగర్,నవంబరు29(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సాగర్ నాట్కో ఫార్మా కంపెనీ హెడ్ వీరనారాయణ అన్నారు. నాట్కో ఫార్మా వ్యవస్థాపకుడు నన్నపనేని వెంకటయ్య చౌదరి 80వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని శనివారం నాగార్జునసాగర్ నాట్కో ఫార్మా కంపెనీలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ రంజిత్, సూర్యనారాయణ, టెక్నీషియన్లు డాక్టర్ మురళీధర్, చంద్రశేఖర్, చక్రవర్తి పాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది!

(5వపేజీ తరువాయి)

చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, బదిలీ అయిన వారు తిరిగి అక్రమ డిప్యూటేషన్లు పొందుతున్నారు.

ఏజీ ఆడిట్ అకౌంట్ అధికారులకు తప్పుడు సమాచారం

ఇటీవల జిల్లా పరిషత్‌కు ఏజీ ఆడిట్ అధికారుల బృందం రాగా, వారిని సైతం తప్పుదోవ పట్టించే విధంగా కొందరూ ఉద్యోగులు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివాసం ఉన్న వారికి హెచ్‌ఆర్‌ఏ (ఇంటి అద్దె భత్యం) చెల్లించడానికి వీలుండదు. కానీ, కొందరూ క్వార్టర్స్‌లోనే నివాసముంటూ అక్రమంగా హౌస్‌రెంట్ అలవెన్స్ తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సైతం ఇదేవిధంగా హెచ్‌ఆర్‌ఏను తీసుకున్న సమయంలో విచారణ వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ క్వార్టర్స్‌లో కాకుండా ప్రైవేట్‌గా అద్దె తీసుకొని ఉంటే ఇంటి అద్దె భత్యాన్ని తీసుకోవచ్చు. కానీ, అందుకు విరుద్ధ పరిస్థితులు ఉన్నట్లు వినికిడి. నాలుగు రోజుల క్రితం అకౌంట్స్ ఆఫ్ జనరల్ ఆడిట్ బృందం జడ్పీలో ఆడిట్ నిర్వహించినప్పుడు పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. క్వార్టర్స్‌లో నివాసం ఉన్నప్పుడు హెచ్‌ఆర్‌ఏను ఎలా చెల్లిస్తున్నారని అడిట్ అధికారులు ప్రశ్నించగా, ఖంగుతిన్న జడ్పీ ఉద్యోగులు అలాంటిది ఏమీలేదని, క్వార్టర్స్‌లో ఎవరూ ఉండటం లేదని సమాధానం ఇచ్చినట్లు వినికిడి. అయితే క్వార్టర్స్‌కు సంబంధించిన కరెంట్ బిల్లు వేల రూపాయలు ఎందుకు వస్తోందని ఆడిట్ అధికారులు ప్రశ్నించడంతో జడ్పీ ఉద్యోగులు మిన్నుకుండి పోయినట్లు సమాచారం. క్వార్టర్స్‌లో ఉన్న వ్యక్తులు విద్యుత్ వినియోగిస్తేనే బిల్లు వస్తుంది కదా? అని ప్రశ్నించినట్టు తెలిసింది. అయినా జడ్పీ ఉద్యోగులు తప్పుడు సమాచారం ఇచ్చినట్టు ఆడిట్ అధికారులు గుర్తించారని విశ్వసనీయంగా తెలిసింది.

ఎవరి విధులు వారే నిర్వహిస్తున్నారు

జిల్లాపరిషత్‌తోపాటు జడ్పీ పరిధిలోని అన్ని కార్యాలయాలు, పాఠశాలల్లో ఎవరి విధులు వారే నిర్వహిస్తున్నారు. ఎక్కడా అక్రమ డిప్యూటేషన్లు లేవు. నిబంధనల మేరకే సెక్షన్లలో పనిచేస్తున్నారు. ఎవరిపై ఎవరూ పెత్తనం చేయడం లేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పరిపాలన సా గుతోంది. నిబంధనలకు అనుగుణంగా కార్యాలయాల్లో పనులు నడుస్తున్నాయి.

శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో

తొలివిడత నామినేషన్ల ఘట్టం ముగిసింది

(5వపేజీ తరువాయి)

పోలింగ్ డిసెంబరు 14వ తేదీన ఉదయం 7 గంటలను నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అదేరోజు 2 గంటల నుంచి కౌంటింగ్ అనంతరం ఫలితాను ప్రకటిస్తారు. అదేరోజు ఉపసర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు.

అభ్యర్థుల ఖరారుకు పార్టీల కసరత్తు

● ఆశావహులతో జోరుగా చర్చలు ● పదవి కోసం ఐదారుగురు పోటీ ● తలనొప్పిగా మారిన ఎంపిక ● రెబెల్‌గా పోటీకి పలువురి యత్నం



నిడమనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14న నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారుచేసేందుకు మండలంలోని ప్రధానపార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో ఆశావహులతో జోరుగా చర్చలు జరుపుతున్నారు. ఈసారి అనేక గ్రామాల్లో పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. సర్పంచ్ పదవికోసం ఎక్కువ మంది పోటీపడుతుండటంతో అభ్యర్థులను ఖరారు చేయడం పార్టీలకు తలనొప్పిగా మారింది. ఒక పార్టీ నుంచి ఐదారుగురు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్‌లో పోటీ ఎక్కువగా ఉంది. పార్టీ గ్రూపులుగా విడిపోయింది. దీంతో అభ్యర్థుల ఎంపిక కొన్ని గ్రామాల్లో కష్టంగా ఉంది. గ్రామా ల్లో సమావేశాలు నిర్వహిస్తూ విజయావకాశాలపై పార్టీ శ్రేణులతో చర్చ లు జరుపుతున్నారు. పంచాయతీ ఎన్నికలను రెండు ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మెజార్టీ పంచాయతీలను గెలుచుకునేందుకు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సాధించిన అధికార కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో సైతం అదే ఊపు కొనసాగించాలని యత్నిస్తుండగా, పంచాయతీల్లో ఎలాగైనా ఉనికి కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ కూడా వ్యూహాలు రూపొందిస్తుంది. ఇందుకోసం గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఇరు పార్టీలు ప్రణాళికలు తయారుచేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో పోరు నువ్వా? నేనా? అనే విధంగా ఉంది. పార్టీలు బలపర్చకపోతే రెబెల్‌గా బరిలో నిలిచేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో అభ్యర్థుల ఎంపికను పూర్తిచేశారు. మండలంలో ఇప్పటికే ఆశావహులు గ్రామాల్లో ప్రచారం కూడా ప్రారంభించారు. మండలంలో 29 పంచాయతీలు ఉన్నాయి. కొన్ని పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏకగ్రీవ చర్చలు కొలిక్కి రావడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు తడిసి మోపెడయ్యేలా ఉంది, అయినప్పటికీ కీలకమైన గ్రామాల్లో ఎంత ఖర్చు చేసేందుకైనా కొందరు వెనుకాడటం లేదు.

కళాశాల సేవలు భేష్

● న్యాక్ గుర్తింపు సాధించాలన్న ఆడిట్ బృందం



కళాశాలలో ఆడిట్ బృందం సభ్యులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్ ఆడిట్ బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు రెహత్‌ఖాన్, వెంకటకృష్ణ మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యాలయంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుతో పాటు ప్రయోగశాల, గ్రంథాలయం, క్రీడావిభాగాల నిర్వహణను పరిశీలించినట్లు తెలిపారు. కళాశాలలో అందిస్తున్న విద్యాసేవలు బాగున్నాయని, ఆర్థిక, గణిత విభాగాల్లో చేస్తున్న పరిశోధనలు భేషుగ్గా ఉన్నాయన్నారు. అంతర్జాతీయ సెమినార్ నిర్వహణ, జిజ్ఞాస పురస్కారం, ఎన్ఎస్ఎస్ సేవలు కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తెస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మల్లిరెడ్డి భీమార్జునరెడ్డి, ఎకాడమిక్ కోఆర్డినేటర్ నాగరాజు, త్రాసు వెంకటరమణ, డాక్టర్ నరేష్ గుమ్మడి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



పార్టీలో చేరుతున్న నాయకులు

నిడమనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం ఆపార్టీకి రాజీనామా చేసి మేరెడ్డి కేశవరెడ్డి, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, అంకతి సత్యం, పార్టీ అధ్యక్షుడు రూపని కృష్ణయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని సూచించారు. చిమట యుగంధర్, గందం బాలరాజు, గొడ్డేటి సాంబయ్య, జానయ్య, లక్ష్మణ్, యాదగిరి, రమేష్, దుబ్బ మహేష్ తదితరులు కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సిరిశాల మల్లేష్, గిరి తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికలు

● ఆర్డీవో రమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

దేవరకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లో డిసెంబరు 17న జరిగే గ్రామపంచాయతీల సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అధికారులను కోరారు. శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డిసెంబరు 3న నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. డివిజన్‌లో 269 గ్రామపంచాయతీల్లో ఎన్నికలు జరుగనున్నాయని, 2206 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో 130 సమస్యాత్మకమైన గ్రామాలను గుర్తించామని, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని ఆర్డీవో తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధంకావాలని శివానీ ఉన్నత పాఠశాల చైర్మన్ కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. మారుతున్న విధానాలు ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించే విధంగా ఉన్నాయన్నారు. స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేషాధారణ అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలకు స్థలాల కొరత

● అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలు



గుర్రంపోడులో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతిగృహం

గుర్రంపోడు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలకు స్థలాల కొరత సమస్యగా మారింది. నిధులు మంజూరైన మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించలేని పరిస్థితి. మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ స్థలాల కొరత తీవ్రంగా వేధిస్తుంది. మండలంలోని బీసీ బాలుర వసతిగృహం, పశువుల ఆసుపత్రి భవన నిర్మాణాలకు నోచుకోని పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం లేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని ఏఎమ్మార్పీ క్యాంపు కార్యాలయ ఆవరణంలోని ఖాళీ స్థలంలో తహసీల్దార్, ఎంపీడీవో ఎమ్మార్సీ కేజీబీవీ, పోలీస్‌స్టేషన్ భవనాలను నిర్మించారు. ఈ స్థలంలోనే స్త్రీ శక్తి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలం అనుమతి ఇంకా నీటిపారుదలశాఖ నుంచి రాలేదు. క్యాంపు కాలనీలోను ఖాళీ స్థలం లేకపోవడంతో నిధులు మంజూరైనా ప్రభుత్వ భవనాలకు స్థలం సమకూర్చడం సమస్యగా మారింది.

స్థలం ఉంటేనే నిధులు మంజూరు

మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహ భవన నిర్మాణానికి అప్పట్లో రూ.25లక్షలు మంజూరుకాగా అవసరమైన స్థలం దొరకలేదు. అవసరమైన స్థలాన్ని సమకూర్చితే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి భవన నిర్మాణానికి గతంలోనే రూ.20లక్షల నిధులు మంజూరైనా స్థలం దొరకకపోవడంతో నిర్మాణానికి నోచుకోక శిథిలావస్థలో ఉన్న భవనంలోనే కొనసాగుతోంది. ప్రైవేట్ స్థలాన్ని కొనుగోలు చేసి అయిన భవన నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పల్లె పోరుకు నామినేషన్లకు వేళాయె

● నేటి నుంచి మూడు రోజుల పాటు స్వీకరణ
● వచ్చే నెల 14న పోలింగ్, లెక్కింపు

నిడమనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వచ్చేనెల 14న నిర్వహించనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆదివారంనుంచి మంగళవారం వరకు మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్ గ్రామాలు ఏర్పాటు చేయడంతోపాటు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించారు. మండలంలో 29 గ్రామపంచాయతీల ఎన్నికలకు 9 క్లస్టర్ గ్రామాలు ఏర్పాటు చేశారు. క్లస్టర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంది. కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉన్నందున మీసేవ కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడంతోపాటు ఇంటి పన్నులు చెల్లించడంలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డుసభ్యుడిగా పోటీ చేసేవారు ఆధార్ కార్డు, నామినేషన్‌ఫాంపై ఫొటో, ఓటరు గుర్తింపు కార్డు, కొత్త బ్యాంకు ఖాతా, ఇంటి పన్ను చెల్లించిన రశీదుతోపాటు ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు అధికారులకు అందజేయాల్సి ఉంది.

నేటి నుంచి రెండో విడత నామినేషన్‌లు

మిర్యాలగూడ: నేటి నుంచి రెండో విడత పోలింగ్‌లో భాగంగా మిర్యాలగూడ డివిజన్ నామినేషన్ ప్రక్రియ ప్రారంభంకానుంది. 282 గ్రామ పంచాయతీలకు సర్పంచ్, 2418 వార్డు మెంబర్లకు అభ్యర్థులు నామినేషన్‌ను వేయనున్నారు. డివిజన్‌లో మొత్తం 93 క్లస్టర్లలో నవంబరు 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు మూడురోజులపాటు అభ్యర్థులను నుంచి నామినేషన్‌లను అధికారులు స్వీకరించనున్నారు. ఈ నెల 14న జరిగే ఎన్నికల్లో 2,418 పోలింగ్ కేంద్రాల్లో 3,28,016 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

వేములపల్లి: రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయతీలనుంచి సర్పంచ్, వార్డుసభ్యులుగా పోటీచేసే అభ్యర్థులనుంచి క్లస్టర్ల వారీగా నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో జితేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలకేంద్రంలో ఆర్‌వో, ఏఆర్‌వోలకు ఎన్నికల విధులపై దిశా నిర్ధేశం చేశారు. మండలంలో మొత్తం 20,568 మంది ఓటర్లు ఉండగా మహిళ ఓటర్లు 10,602, పురుష ఓటర్లు 9,966 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 12 సర్పంచ్, 116 వార్డుల నుంచి నామినేషన్లను స్వీకరించేందుకుగాను మూడు క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

త్రిపురారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆదివారంనుంచి సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. మండలంలోని 32 గ్రామాలకు చెందిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు తొమ్మిది క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు శనివారం ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. 32 గ్రామ సర్పంచ్ పదవులు, 270 వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లు వేయడానికి నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి వివరాలు తెలిపారు.


ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరి శర్మ

మిర్యాలగూడ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విధులలో పాల్గొనే అధికారులు ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో శేషగిరి శర్మ అన్నారు. శనివారం మిర్యాలగూడ రైతువేదికలో డిసెంబరు 14న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులపై గతంలో మాస్టర్ ట్రైనర్‌లతో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బాలు, జిల్లాస్థాయి మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య, ఎంపీవో రమేష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ కరుణాకర్ పాల్గొన్నారు.

పెరిక సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా వెంకటరమణ



వెంకటరమణ

నిడమనూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెరిక సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి ముత్తయ్య శనివారం ఆయనకు నియామక పత్రం అందించారు. వెంకటరమణ గతంలో అనేక పదవులు చేపట్టారు. సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమితులైన వెంకటరమణను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరికల అభ్యున్నతికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నాయినోనికుంటపై హక్కులు కల్పించాలని వినతి

దేవరకొండ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని నాయినోనికుంటపై హక్కులు కల్పించాలని మత్స్య పారిశ్రామిక సహకారసంఘం నేతలు శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయ అధికారి అయూబ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగయ్య, కొప్పరి శంకరయ్య, ముదిరాజుసంఘం అధ్యక్షుడు శంకర్, విజయ్, జింకల రవి, నీల వెంకటయ్య, అరుణ్ కోరారు.